# పెన్ పవర్

PEN POWER 12 YEARS JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక : 12 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ గురువారం 17 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :12 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA THU 17 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు?

## ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు

- 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం
- అన్ని వర్గాలను బలోపేతం చేసేలా రుణాలు అందించాలని బ్యాంకర్లకు చంద్రబాబు సూచన
- రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడటంపై సీఎం అసంతృప్తి
- రుణాల చెల్లింపులో ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 అని ప్రశంస
- పీఎం సూర్యఘర్ పథకానికి పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- కౌలు రైతులకు రుణసాయం పెంచాలని బ్యాంకులకు దిశానిర్దేశం




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని అన్ని రంగాలను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందించాలని, లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో బుధవారం జరిగిన 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన పాల్గొని, వివిధ అంశాలపై అధికారులకు, బ్యాంకర్లకు కీలక దిశానిర్దేశం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేనప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏముంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణాల మొత్తం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదు. కొన్ని బ్యాంకులు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి" అని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యం ఉందని, ఇందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు.స్వయం సహాయక సంఘాల (ఎస్హెచ్‌జీ) మహిళలు రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. "రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు. ఈ విషయంలో ఏపీ ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలిచారు. కేవలం 0.67 శాతం మంది మాత్రమే చెల్లింపుల్లో విఫలమవుతున్నారు. వీరి నుంచి బకాయిలు వసూలు చేసేందుకు 'వన్ టైమ్ సెటిల్‌మెంట్' (ఓటీఎస్) విధానంపై ఆలోచించాలని బ్యాంకులకు సూచిస్తున్నాను" అని వివరించారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఎల్‌నినో కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతికూలతలను అధిగమించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ రంగంలో కీలకమైన కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేందుకు బ్యాంకులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత.. మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..

- తిరుమలను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక నమూనాగా తీర్చిదిద్దుతామన్న సీఎం
- రూ.104 కోట్లతో ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి
- తిరుమల వచ్చే ప్రతి భక్తుడికి రూ.2 లక్షల బీమా సౌకర్యం
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం

2లో



# ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- ఎఫ్‌బీఐగా నటిస్తూ ఏపీ పోలీసులు సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని కోరారని వెల్లడి
- ఇది ప్రభుత్వ ప్రాయోజిత మోసమంటూ జగన్ విమర్శ
- ఈ చర్యతో ఏపీ పరువు తీశారంటూ మండిపడ్డ మాజీ సీఎం
- హామీల అమలుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి హితవు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్

- మిగతా 2లో




## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే చంద్రబాబు సంక్షేమ డ్రామా ఆడుతున్నారని వైసీపీ విమర్శ
- కొత్త ప్రభుత్వం వచ్చాక అర్హులకు పెన్షన్లు ఇవ్వడం లేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపణ
- దాదాపు 6 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులను తొలగించారని విమర్శ
- జగన్ తెచ్చిన జీవోతోనే అసైన్డ్ భూములకు హక్కులు దక్కుతున్నాయని వెల్లడి
- కేంద్రం కేటాయించిన ఇళ్లు నామమాత్రమేనని వ్యాఖ్య

- మిగతా 2లో

## వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- డిశ్చార్జ్ పిటిషన్లు వేసిన గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి
- పిటిషన్లకు విచారణార్హత లేదన్న కోర్టు
- నిందితులపై అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో నాంపల్లిలోని ప్రత్యేక సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. తమపై నమోదైన తీవ్ర అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ప్రధాన నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా

- మిగతా 2లో




## జీరం ఘాటీ నరమేధం కేసులో చారిత్రక తీర్పు..

# 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

- 2013లో కాంగ్రెస్ పార్టీ పరివర్తన్ యాత్రపై దాడి
- మావోల దాడిలో 29 మంది దుర్మరణం
- 10 మంది మావోలకు ఉరిశిక్ష విధించిన ఎన్ఐఏ న్యాయస్థానం


పెన్ పవర్ డెస్క్:ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ 'పరివర్తన్ యాత్ర' కాన్వాయ్‌పై దాడి చేసిన మావోయిస్టులు 29 మందిని అతి దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ దాడి కేసులో జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన మొత్తం 10 మంది మావోయిస్టులకు

- మిగతా 2లో

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

- ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- శనివారం సాయంత్రానికి అల్పపీడనం ఏర్పాటుకు సూచనలు
- ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం
- ప్రభావంతో వచ్చే వారం రాష్ట్రంలో వర్షాలు కురిసే ఛాన్స్
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిక వెల్లడి

- మిగతా 2లో







## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం

- భార్య ముక్కు కొరికేసిన భర్త
- మంచిర్యాల జిల్లాలో జరిగిన దారుణ ఘటన
- కాపురానికి రావడం లేదన్న కోపంతో భర్త దాడి
- అడ్డువచ్చిన మామపై కూడా కర్రతో దాడి
- వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి బాధితురాలు తరలింపు

- మిగతా 2లో




## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

### నెల్లూరులో ఆధునిక పాఠశాలలను ప్రారంభించిన మంత్రి లోకేశ్

- నెల్లూరులో ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ ప్రభుత్వ స్కూళ్లను ప్రారంభించిన మంత్రి
- వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ స్కూల్‌కు కార్పొరేట్ హంగులు
- డిజిటల్ తరగతులు, రోబోటిక్స్ ల్యాబ్, సింథటిక్ క్రీడా ప్రాంగణం వంటి ప్రత్యేకతలు
- పాఠశాల పనితీరుపై సమీక్ష.. ఉత్తీర్ణత శాతం పెంచాలని అధికారులకు లోకేశ్ ఆదేశం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఇతర టీడీపీ నేతలు

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నెల్లూరు నగరంలో మరో ముందడుగు పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో

- మిగతా 2లో

## సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు



- కేంద్ర విమోచన వేడుకలకు అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరణ
- రాష్ట్రంలో 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహణ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వేడుకలు

- మిగతా 2లో

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

పెన్ పవర్ డెస్క్: సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# రావాలి అవంతి అంటున్న వైసీపీ !

నాకొద్దీ పార్టీ అని మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఇప్పటికి రెండేళ్ళ క్రితం వైసీపీని వీడిపోయారు. చిత్రంగా ఇపుడు వైసీపీకి ఆయనే అవసరం అవుతున్నారు అని అంటున్నారు. భీమునిపట్నం వైసీపీ ఇంచార్జిగా ఉన్న చిన్న శ్రీను టీడీపీలో చేరిపోయారు. ఆయన పార్టీని వీడి పది రోజులకు దగ్గర పడుతున్నా భీమిలీ వైసీపీ ఇంచార్జిగా ఎవరిని ఎంపిక చేయాలో తెలియక ఆ పార్టీ సతమతం అవుతోంది. వైసీపీకి భీమిలీ ఇపుడు అతి పెద్ద పరీక్ష పెడుతోంది. విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడిని, అలాగే నెల్లిమర్ల వైసీపీ ఇంచార్జిని వెంటనే నియమించిన వైసీపీ అధినాయకత్వం భీమిలీ విషయంలో మాత్రం ఏమీ పాలుపోక ఆగిపోయిందా అన్న చర్చ వస్తోంది. ఎందుకంటే భీమిలీ టీడీపీకి కంచుకోట. అక్కడ వైసీపీని నడపడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకే అర్ధబలం అంగబలం ఉన్న నేతల కోసం పార్టీ చూస్తోంది.

**వైసీపీ సర్వేలో ఆయనే :**

ఇదిలా ఉంటే భీమిలీ నియోజకవర్గానికి కొత్త వైసీపీ ఇంచార్జిగా ఎవరిని నియమించాలి అన్న దాని మీద పార్టీ అంతర్గత సర్వే నిర్వహిస్తే మెజారిటీ క్యాడర్ తో పాటు నాయకులు అంతా అవంతికి జై కొట్టారని తెలుస్తోంది. అవంతి 2019 నుంచి 2024 మధ్యలో వైసీపీలో ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేశారు. విశాఖ వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా ఆయన ఉన్నారు. ఆయన బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు అంగబలం అర్ధ బలానికి లోటు లేదు. ఇక 2009లో ప్రజా రాజ్యం నుంచి ఒకసారి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అలా ఆయనకంటూ సొంత బలం అనుచర గణం ఉంది. అందువల్ల ఆయనకే పార్టీ బాధ్యతలు అప్పగిస్తే భీమిలీలో కూటమిని ధీటుగా ఎదుర్కొంటారు అని అంటున్నారు. ఇది భీమిలీ మెజారిటీ వైసీపీ నేతల మాటగా ఉంది.

**ఇంతకీ ఆయన వస్తారా :**

అయితే ఇదంతా ఒంటి చేతి చప్పుడు మాదిరిగానే ఉంది అంటున్నారు. వైసీపీ తన సర్వేలు తాను చేస్తోంది. అందులో అవంతి పేరు కూడా జోడించింది. అందరూ అవంతి కావాలని కోరుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది కానీ ఇంతకీ అవంతి శ్రీనివాసరావు వైసీపీలోకి తిరిగి చేరుతారా అన్నదే పెద్ద చర్చగా ఉంది. ఆయన 2024 డిసెంబర్ లో వైసీపీకి రాజీనామా చేశారు. అప్పట్లో ఆయన ఆలోచనలు కూటమిలో చేరాలని. అందుకే వైసీపీ మేయర్ ని దించడానికి కార్పోరేటర్ గా ఉన్న తన కుమార్తె చేత కూడా వైసీపీకి వ్యతిరేకంగా ఓటేయించి టీడీపీ కూటమికి జీవీఎంసీ దక్కేలా చేశారు. అయితే టీడీపీలో ఆయన రాకను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వ్యతిరేకించడంతో ఆగింది అని అంటున్నారు.

**తగిన మూల్యం చెల్లిస్తోంది :**

జనసేనలో ఆయనను చేర్చుకోవడానికి కూడా స్థానికంగా అంగీకారం లేదని చెబుతున్నారు. ఈ కారణాల వల్లనే ఆయన ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు అని అంటున్నారు. డీలిమిటేషన్ మీద అవంతి ఆశలు పెట్టుకున్నారు. సీట్లు పెరిగితే కనుక కూటమి పార్టీలలో చేరి మళ్ళీ పోటీ చేయాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో అవంతి వైసీపీలో చేరుతారు అన్నది ఎంతవరకూ జరుగుతుంది అన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఒకవేళ మనసు మార్చుకుని అవంతి వైసీపీలో చేరితే మాత్రం వైసీపీకి గండం గట్టెక్కినట్లే అంటున్నారు. మొత్తానికి చూస్తే గతంలో వైసీపీలో ఎంతో మంది నాయకులు ఉన్నారు. కానీ ఎన్నికల వేళ వారిని అందరినీ దూరం చేసుకున్న పాపానికి ఇపుడు వైసీపీ తగిన మూల్యం చెల్లిస్తోంది అని అంటున్నారు.

## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

- మొదటి పేజీ తరువాయి

అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేసిన రెండు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన నెల్లూరు చేరుకోగా, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా పలువురు జిల్లా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెందిన వీపీఆర్ ఫౌండేషన్ అందించిన రూ.8.3 కోట్ల ఆర్థిక సహకారంతో సమూలంగా ఆధునికీకరించిన ఆర్.ఎస్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

**కార్పొరేట్ హంగులతో ఆర్ఎస్ఆర్ స్కూల్**

వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ పాఠశాలలో మొత్తం 43 తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ బోధన కోసం ప్రతి గదిలో ఎల్ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రయోగాత్మక, సాంకేతిక విద్య అందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తూ పాఠశాలలో ఎకరం విస్తీర్ణంలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టును, అవుట్‌డోర్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూలపేట 39వ డివిజన్‌లో రూ.13.4 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునికీకరించిన దేవిరెడ్డి శారద (డీఎస్ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను కూడా లోకేశ్ ప్రారంభించారు.

**ఫలితాలపై దృష్టి పెట్టండి: మంత్రి లోకేశ్**

పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం, ఆర్.ఎస్.ఆర్. పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయుడు, ఇతర అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. కేవలం భవనాలు నిర్మిస్తే సరిపోదని, విద్యా ప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- మొదటి పేజీ తరువాయి

పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

"చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత.. మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..

తిరుమలను ప్రపంచస్థాయి పవిత్ర దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ఓ గొప్ప నమూనాగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతను ఆధ్యాత్మికతతో సమన్వయం చేస్తూ భక్తులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా, బుధవారం తిరుమలలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రూ.104 కోట్ల భారీ వ్యయంతో టీసీఎస్ ట్రస్ట్ ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియంతో పాటు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన 'పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ఆయన భక్తులకు అంకితం చేశారు. భక్తులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను తీర్చిదిద్దారు. ఇందులో శ్రీవారికి జరిగే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలతో పాటు తిరుమల క్షేత్రంలోని వివిధ ప్రాంతాలను 3డీ సాంకేతికత ద్వారా కళ్లారా వీక్షించే అవకాశం కల్పించారు. 6డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా శ్రీవారి దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా స్వీకరించి, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం, ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియాన్ని సీఎం ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీనివాసుని కల్యాణ ఘట్టం వంటి విశేషాలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా ఇందులో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణదేవరాయలు వంటి మహారాజులు స్వామివారికి సమర్పించిన ఆభరణాల 3డీ నమూనాలు, చారిత్రక వస్తువులు, స్వామివారి కిరీటాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పానోరమిక్ స్క్రీన్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన శ్రీవారి పరిణయ వీడియోను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. ఆనాటి సంగీత విద్వాంసులు వాడిన వాయిద్య పరికరాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మరికొన్ని కీలక ప్రకటనలు చేశారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికి ఎల్ఐసీ భాగస్వామ్యంతో ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. దీని ద్వారా తిరుమలలో దురదృష్టవశాత్తూ భక్తుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల నుంచి కూడా ఆలయ నిర్మాణానికి విజ్ఞప్తులు వస్తున్నాయని చెప్పారు. అనంతరం, తిరుమలలో భక్తుల సౌకర్యార్థం రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, దాతల ప్రతినిధులు సుచిత్రా ఎల్లా, నితిన్ సేత్‌లతో కలిసి ఆయన ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణించారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే కొండపై 89.5 శాతం పచ్చదనం ఉందని గుర్తుచేశారు. ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, సేవ, ఆధునిక సాంకేతికత వంటి ఆరు కీలక అంశాల ప్రాతిపదికన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి వివరించారు.

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 19) సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు

ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.

## సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు

హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది.

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

- మొదటి పేజీ తరువాయి

అలముకున్నాయి. గ్రామంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నరసింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు.

**ఘటనపై మంత్రి పొన్నం తీవ్ర దిగ్భ్రాంతి**

గణేశ్ నిమజ్జనం సందర్భంగా శిరీష ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదకరమైన, లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- మొదటి పేజీ తరువాయి

కొట్టివేసింది. కేసులో ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్ రెడ్డి, ఏ6 గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు డిశ్చార్జ్ పిటిషన్లను సమగ్రంగా విచారించిన కోర్టు, వాటికి ఎలాంటి విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్లు, సాంకేతిక ఆధారాలు, సమర్పించిన సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... నిందితులపై ఉన్న అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టం చేసింది.

## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలపై బూటకపు ప్రచారం చేస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఇప్పుడు ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించి మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ అవే హామీలను వల్లె వేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బలహీన వర్గాలకు, మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయలేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేసిన తేదీ నుంచి కాకుండా, బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు తమ పింఛన్ల దరఖాస్తుల ఆమోదం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జగన్ హయాంలో వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు అందేవని, చంద్రబాబు ఆ సమర్థవంతమైన వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏదో ఒక సాకు చూపి లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారని, జగన్ హయాంలో దాదాపు 69 లక్షల మందికి పింఛన్లు అందగా, చంద్రబాబు ప్రభుత్వం సుమారు ఆరు లక్షల మందిని తొలగించిందని ఆరోపించారు. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి లేమిని స్పష్టం చేస్తోందన్నారు. అసైన్డ్ భూములపై చంద్రబాబు చేస్తున్న ప్రచారాన్ని శ్రీకాంత్ రెడ్డి తప్పుదోవ పట్టించే చర్యగా అభివర్ణించారు. పదేళ్లుగా వివాదాస్పద అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న వారికి పట్టా హక్కులు కల్పించే జీవోను జగన్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ భూములను ఫ్రీహోల్డ్ ఆస్తులుగా మార్చడం ఆ జీవో ఫలితమేనని, కానీ దీనిని తమ ఘనతగా చెప్పుకుంటూ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ఒరాష్ట్రానికి 5 లక్షల ఇళ్లు కేటాయించామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పడంపై స్పందిస్తూ.. జగన్ ప్రభుత్వం మహిళల పేరు మీద పంపిణీ చేసిన 30 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలతో పోలిస్తే ఇది చాలా తక్కువని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం

తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ఓ కిరాతక ఘటన వెలుగుచూసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో ఆగ్రహానికి లోనైన భర్తే, భార్య ముక్కు కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ అమానుష ఘటన బుధవారం కొటపల్లి మండలంలో చోటుచేసుకుంది. మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మమత తన పుట్టింట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో భార్యను తిరిగి తన వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ నేడు అత్తవారింటికి వెళ్లాడు. అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేశాడు. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మమతపై కూడా అతను విచక్షణారహితంగా దాడి చేసి, ఆమె ముక్కును కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలి ముక్కు భాగం తీవ్రంగా దెబ్బతింది. స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జీరం ఘాటీ నరమేధం కేసులో చారిత్రక తీర్పు.. 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

- మొదటి పేజీ తరువాయి

మరణశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వం తుడుచుపెట్టుకుపోయింది. ఈ దారుణ నరమేధంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, నాటి పీసీసీ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మా సహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. దోషులపై భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఏ కోర్టు ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. భారత రాజకీయ మరియు భద్రతా చరిత్రలో చోటుచేసుకున్న అతిపెద్ద తీవ్రవాద దాడుల్లో ఒకటైన ఈ కేసులో 13 ఏళ్ల తర్వాత బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కృతజ్ఞతా పూర్వకంగా కలిసిన ముద్రగడ కుమారులు.



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్,16:**తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి,ముద్రగడ పద్మనాభం కుమారులు ముద్రగడ బాలు, ఆయన సోదరులు ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని బుధవారం కృతజ్ఞతా పూర్వకంగా కలిశారు. తన తండ్రి, మాజీ మంత్రి ప్రజా నాయకులు ముద్రగడ పద్మనాభం ఇటీవల కన్నుమూసిన సమయంలో వారి అంతిమయాత్రలో వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి స్వయంగా పాల్గొని, పాడే మోసి తమ కుటుంబానికి పెద్ద కొడుకుగా కొండంత అండగా నిలిచారని ఈ సందర్భంగా ముద్రగడ కుమారులు తెలియజేసారు. కష్టసమయంలో తమ కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చి చూపించిన ఆప్యాయతకు రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని, ఈ మేలును ముద్రగడ కుటుంబం ఎప్పటికీ మరచిపోదని వారు వైయస్ జగన్మోహన్ రెడ్డికి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం తన రాజకీయ జీవితాన్ని నిబద్ధత, విశ్వసనీయత, ఉన్నతమైన వ్యక్తిత్వంతో కొనసాగించారని,మీ రాజకీయ జీవితంలో కూడా ఇదే విధమైన నిబద్ధత, విలువలతో ముందుకు సాగాలని ఆయన గుర్తుచేస్తూ డబ్బు పోతే మళ్ళీ సంపాదించుకోవచ్చు, ఆరోగ్యం పోతే కొంత దెబ్బతింటాం... కానీ ఒక్కసారి వ్యక్తిత్వాన్ని, మంచి పేరును కోల్పోతే జీవితంలో ప్రతిదీ కోల్పోయినట్టే" అని విశ్వసనీయతను కాపాడుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతు ఇకపై నియోజకవర్గానికి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటూ,స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డికి తెలియజేసారు

# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా



# వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

- అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వో పోస్టులు కల్పించాలి
- విధి నిర్వహణలో మృతిచెందిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలి

**కాజులూరు, పెన్‌పవర్, సెప్టెంబర్ 16:**ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) సమ్మెబాట పట్టారు.ఇందులో భాగంగా బుధవారం కాజులూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు వినకోటి సత్యనారాయణ మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేసి ఆర్థిక భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో వీఆర్ఏలకు అమలు చేస్తున్న విధంగా పే స్కేల్ సదుపాయాన్ని తమకు కూడా వర్తింపజేయాలని కోరారు.నామినీలుగా పనిచేస్తున్న వారితో పాటు ఆన్‌లైన్ సెటిల్‌మెంట్ వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తున్న అర్హులను గుర్తించి తగిన విధంగా నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన వీఆర్ఏల్లో 70 శాతం మందిని వీఆర్వోలుగా నియమించాలని డిమాండ్ చేశారు.విధి నిర్వహణలో మృతిచెందిన వీఆర్ఏల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సత్యనారాయణ కోరారు. ఆయా కుటుంబాల్లో అర్హత ఉన్న ఒకరికి వయసుతో సంబంధం లేకుండా ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయిలో రెవెన్యూ పరిపాలనలో వీఆర్ఏలు కీలకమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వీఆర్ఏ సంఘం నాయకులతో తక్షణమే చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని వినకోటి సత్యనారాయణ కోరారు. నిరసన కార్యక్రమంలో వీఆర్ఏలు వాసంశెట్టి సుబ్బారావు, తాతపూడి రాజు, ఎం.వెంకటరమణ, లంక రవికుమార్, ప్రసాద్, విష్ణు, భవాని, సాయిలక్ష్మి, వీర్రాజు, చంద్రశేఖర్, పద్మ, వెంకటేశ్వరరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ లబ్ధిదారులు లేక

# వెలవెలబోతున్న సచివాలయాలు





- మొన్నటి దాకా పింఛన్ దరఖాస్తుకు క్యూ కట్టిన ప్రజలు
- జగ్గంపేట మండలంలో పింఛన్లకు 2096 దరఖాస్తులు
- మరో రెండు రోజులు గడువు పెంచిన ప్రభుత్వం
- అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు
- సర్వర్ సమస్య లేదు.. ఎప్పటి దరఖాస్తు అప్పుడే ఆన్లైన్ చేస్తున్న సిబ్బంది

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబరు 16:** రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటిసారి అర్హులకు పింఛన్ల కోసం దరఖా స్తులు కోరుతుంది. మొదట ఈనెల 7వతేదీ నుంచి 16వతేదీ వరకు పింఛన్ల దరఖాస్తుకు గడువు ఇచ్చింది. దీంతో తొలుత రెండు మూడురోజులు పింఛన్ దారులతో స్వర్ణ గ్రామ కార్యాలయాలు (సచివాలయాలు) కళకళాడాయి. చాలా వరకు ప్రజలు పింఛన్ల దరఖాస్తుకు పోటెత్తారు. అయితే అనేక నిబంధనల మధ్య కేవలం అర్హుల దరఖాస్తులను మాత్రమే సిబ్బంది స్వీకరించి ఆన్లైన్ చేశారు. పింఛన్ ఆన్లైన్ చేసే మొదట్లో కొంత సర్వర్ సమస్య వచ్చినప్పటికీ రానురాను ఆ సమస్య తగ్గింది. దీంతో ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పింఛన్ దరఖాస్తులను స్వర్ణ సిబ్బంది ఆన్లైన్ చేశారు. ప్రభుత్వం పింఛన్ దరఖాస్తుకు పరిమిత సమయం మాత్రమే ఇవ్వడం, దానికి తోడు శని, ఆది, సోమ మూడు రోజుల పాటు వరుస సెలవులు రావ డంతో పింఛన్ దారులు దరఖాస్తుకు సమయం అయిపోతుందేమోనని ఒకింత ఆందోళన చెందారు. అయినా సరే స్వర్ణ కార్యాలయాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి పింఛన్లను ఆన్లైన్ చేశారు. తాజాగా ప్రభుత్వం ఈనెల 18వతేదీ వరకు పింఛన్ దరఖాస్తుకు గడువు పెంచడంతో ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని ప్రస్తుతం ఆన్లైన్ చేయాల్సిన దరఖాస్తులు ఏం లేవని ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఆన్లైన్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని సర్వర్ సమస్యలేదని జగ్గంపేట స్వర్ణ కార్యాలయం సిబ్బంది చెపుతున్నారు. అయితే కొన్ని చోట్ల 50 సంవత్సరాలు పైబడిన వారు పింఛన్ దరఖాస్తుకు రావడంతో వారు అనర్హులు తెలియడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. అలాగే విద్యుత్ యూనిట్లు ఎక్కువ నమోదు కావడం, మ్యాపింగ్ సమస్యలతో ఇబ్బందులు తప్పలేదు. పింఛన్ దరఖాస్తులపై జగ్గంపేట ఎంపీడీవో ఏవిఎస్ చంద్రశేఖర్ ను జగ్గంపేట పెన్ పవర్ ప్రతినిధి వివరణ కోరారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈనెల 7వతేదీ నుంచి 16వతేదీ వరకు జగ్గంపేట మండలంలో 2096 మంది పింఛన్లకు దరఖాస్తులు చేసుకున్నారని వాటిని ఆన్లైన్ చేశామన్నారు. వికలాంగ పింఛన్లకు 436, వృద్ధాప్య పింఛన్లకు 1109, ఒంటరి మహిళలు 2, కళ్ళు గీత కార్మికులు 54, ట్రాన్స్ జెండర్లు 3, నేత కార్మికులు 10, వితంతు పింఛన్లకు 480 దరఖాస్తులు అందాయన్నారు. అత్యధికంగా స్వర్ణ జగ్గంపేట-1 నుంచి 162 మంది, అత్యల్పంగా స్వర్ణ రామవరం-2 నుంచి 30 మంది పింఛన్లకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈనెల 18వతేదీ వరకు పింఛన్ దరఖాస్తులకు సమయం ఉందని అర్హులు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అన్నారు. గ్రామంలో ఎక్కడా ఏవిధమైన ఇబ్బంది లేకుండా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు.





# అగరబత్తుల తయారీతో మహిళలకు స్వయం ఉపాధి




**కాజులూరు, పెన్‌పవర్, సెప్టెంబర్ 16:** వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. కాజులూరు మండలం గొల్లపాలెంలో ఏఎంసీ డైరెక్టర్ సలాది పుష్పవతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగరబత్తుల తయారీ స్వయం ఉపాధి శిక్షణ తరగతులను బుధవారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అగరబత్తుల తయారీ వంటి కుటీర పరిశ్రమల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడంతో పాటు ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.శిక్షణతో పాటు మార్కెటింగ్, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల అనుసంధానానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. మహిళలు క్యాటరింగ్ రంగంలోనూ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న మహిళలకు క్యాటరింగ్‌కు అవసరమైన షామియానాలు ఏర్పాటు చేసి, కొన్ని కాంట్రాక్టు పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ కార్యక్రమం ద్వారా మహిళలకు రుణ సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. గొల్లపాలెంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు అగరబత్తుల తయారీపై స్వయం ఉపాధి శిక్షణ ఇస్తున్నట్లు బ్యాంకు ప్రతినిధులు వెల్లడించారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, టీడీపీ మండల అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు), యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ జయ సత్యవేణి, ఫ్యాకల్టీ శంకర్రావు, డీఆర్‌డీఏ అధికారులు, శిక్షకులు శంకర్, చైతన్య, ఏపీఎం టి.మురళీకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగేశ్వరి నాగార్జున, టీడీపీ నాయకులు చుండ్రు వీర్రాజు చౌదరి, తాడి రామారెడ్డి,అంగర కృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు బొండా వెంకన్న ,యానిమేటర్లు అపర్ణ,ఇంద్రజ, శైలజ,అరుణ,తదితరులు పాల్గొన్నారు.

# విఆర్ఏల న్యాయమైన డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలి.

-ప్రత్తిపాడులో వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్,15:** వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ప్రత్తిపాడు మండలం వి.ఆర్.ఏల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని నిరవధిక సమ్మె చేపట్టారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వీఆర్ఏల అందరికీ తెలంగాణ తరహాలో పే స్కేలు తక్షణమే అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలు అందర్నీ వన్ టైం సెటిల్మెంట్ విఆర్ఎల్ గా నియమించాలని,అర్హులైన వీఆర్ఏలకు 70 శాతం పదోన్నతి కల్పించాలని, మరణించిన విఆర్ఏల కుటుంబాలలో వయసుతో సంబంధం లేకుండా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ కొమరగిరి కృష్ణ, కార్యదర్శి,మానూరి సత్తిబాబు, కోశాధికారి, మురా గంగరాజు, వైస్ ప్రెసిడెంట్ ఖండవిల్లి బాలరాజు, కార్యవర్గ సభ్యులు దాసు,బూరా సత్తిబాబు,కుళ్ల రామకృష్ణ, బూరా చినబాబు, చినప్పారావు,ఇందుగబిల్లి నాని,అనిల్,కుమార్ మండలంలోని పలు వీఆర్ఏలు పాల్గొన్నారు.



# రేపు జగ్గంపేటలో మెగా జాబ్ మేళా

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** జగ్గంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మరియు జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ(ఏపిఎస్ఎస్ డిసి) సహకారంతో సెప్టెంబర్ 18న శుక్రవారం జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తునట్టు కళాశాల ప్రిన్సిపల్ చెన్నారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో సాఫ్ట్ వేర్, ఫార్మా, బ్యాంకింగ్, బి.పి.ఒ మరియు టెక్నికల్ రంగాలైన సుమారు 1000 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగనున్నాయన్నారు. టాటా క్యాపిటల్, వీల్స్ మార్ట్, కియా, యునో మిండా, మెడ్స్, ఐ ఎఫ్ బి ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఐసీఐసీఐ బ్యాంక్, ఫాక్సుక్, టెక్ మహీంద్రా, రాయల్ ఎన్ఫీల్డ్, విప్రో, టాటా ఎలక్ట్రానిక్స్, ఇండో-ఎం ఐ ఎం ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోవ్సర్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్, ఫోస్పీ, మార్క్ టెక్నాలజీస్ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్.ఎస్.సి నుండి పి.జి వరకు ఉత్తీర్ణులైన 45 సంవత్సరాల లోపు అభ్యర్థులు అందరూ అర్హులు అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.13వేలు నుండి రూ.40వేలు వరకు జీతం, ఇన్సెంటివ్స్ భోజనం, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అందరూ సెప్టెంబర్ 18వ తేదీ శుక్రవారం జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉదయం 9 గంటలకు జెరాక్స్ సర్టిఫికెట్స్ లతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8247788247, 8688977277, 9490175415 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## జగ్గంపేటలో ప్రపంచ ఓజోన్ దినోత్సవ వేడుకలు




**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ జి. సత్యనారాయణ అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పి.ఆర్. ప్రభుత్వ కళాశాల (అటానమస్), కాకినాడలో సీనియర్ లెక్చరర్ గా పనిచేస్తున్న వి. మల్లికార్జున శర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఓజోన్ పొర ప్రాముఖ్యతను, భూమిపై జీవరాశుల రక్షణలో ఓజోన్ పొర పోషించే కీలక పాత్రను వివరించారు. ఓజోన్ పొర క్షీణతకు కారణమయ్యే అంశాలపై అవగాహన కల్పిస్తూ, ఓజోన్ పొరను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ చర్యలను చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు సందర్భంగా కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తాము అనే ప్రతిజ్ఞ చేయించారు. అనతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ బాలరాజు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పై అవగాహన కల్పించడమే లక్ష్యం

**టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్**



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** జగ్గంపేట నియోజకవర్గంలో ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పై అవగాహన కల్పించేందుకే మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్నామని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ తెలిపారు. జగ్గంపేట మండలంలో మన్యంవారిపాలెం ఇద్దరికీ, గోవిందపురం ఒక్కరికి, సీతానగరం ఒక్కరికి మొత్తం నలుగురికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కృషితో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80 లక్షల చెక్కులను నవీన్ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు రాజకీయాలకు అతీతంగా చేయూతనివ్వడమే లక్ష్యంగా జగ్గంపేట నియోజకవర్గంలో ముందుకు సాగుతున్నామని, అందుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేస్తున్న కృషి ఎంతో ఉందని జ్యోతుల నవీన్ అన్నారు. జగంపేట మండలం మన్యం వారి పాలెం గ్రామంలో కరెంటు సమస్యపై మహిళలు జ్యోతుల నవీన్ కు వివరించగా ఆయన అధికారులతో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, బుర్రిసత్తిబాబు, దేవరపల్లి మూర్తి, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు, పాండ్రంగి రాంబాబు, దాట్ల గోపిరాజు, రాయి సాయి, వెలిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది




**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** మండలంలోని రామవరం, కాట్రావులపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జగ్గంపేట వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏ సాగు చేయాలి, ఎరువులు ఏవిధంగా అనే విషయాల గురించి వివరించారు. కాట్రావులపల్లిలో మొక్కజొన్న సాగులో మెళు కువులను తెలియజేశారు. ఎల్ నినో ప్రభావంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రాకేష్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాల ముసాయిదాపై రాజకీయ పార్టీలతో సమావేశం

**గండేపల్లి మండలంలో 57 పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు, సూచనల స్వీకరణ**



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 16** మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) రెండో సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా గండేపల్లి మండల పరిషత్ పరిధిలోని 16 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్, విజయవాడ జారీ చేసిన నోటిఫికేషన్ నెం. 515/రాజుజ-దీ1/2026, తేదీ 07-09-2026 ప్రకారం సెప్టెంబర్ 15న 57 ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు సెప్టెంబర్ 16న గండేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ హరికృష్ణ సత్యారెడ్డి తెలిపారు. సమావేశంలో పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు, సూచనలు ఉంటే తెలియజేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పోతుల వెంకన్న చౌదరి, జాస్తి వసంత్, మద్దిపట్ల రామకృష్ణ చౌదరి, బొల్లం రెడ్డి రామకృష్ణ చౌదరి, తోరాటి వెంకన్న, నేదూరి భాస్కరరావు, నక్కా సత్తిబాబు, పులి ప్రసాద్, గోన వెంకట శివ రామకృష్ణ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డ ఆరోగ్యం





- ఆకుకూరలు, పప్పుదినుసులు, పండ్లు, చిరుధాన్యాలు తప్పనిసరిగా తీసుకోవాలి
- అంగనవాడి కార్యకర్త వై. వెంకట్ లక్ష్మి

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ ,16** పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంగన్వాడీ కార్యకర్త వై. వెంకటలక్ష్మి తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని తాళ్లూరు-1 అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులతో పోషణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు, పండ్లు, చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మునగాకులో అధిక పోషక విలువలు ఉన్నాయని, మునగాకు పప్పు, కూరతో పాటు మునగాకు పొడిని కూడా ఆహారంగా తీసుకోవచ్చని వివరించారు.
తోటకూర, గోంగూర, బచ్చలికూర, పొన్నగంటి కూర వంటి ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. పప్పుదినుసుల ద్వారా శరీరానికి అవసరమైన ప్రోటీన్లు లభిస్తాయని, పండ్లలో జామకాయ వంటి వాటిని తీసుకోవడం వల్ల అనేక పోషకాలు అందుతాయని చెప్పారు. రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
కార్యక్రమంలో అంగన్వాడీ ఆయా సత్యవతి, ఆశా కార్యకర్త వెంకటలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 26 నుంచి జరిగే ప్రజాకళా జాతరలో పాల్గొనండి



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**ఈ నెల 26, 27, 28 తేదీలలో హైదరాబాదులో జరిగే ప్రజాకళా జాతరను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామపంచాయతీ రంగవల్లి నగర్ లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం-ఏఐఎఫ్టి యు- పి డి ఎస్ యు (వి)- పి ఓ డబ్ల్యు స్త్రీ విముక్తి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ 50 ఏళ్ల కాలంలో విమలక్క పాడిన పాటలన్నీ పాడుతూ, ఆమెతో గొంతు కలుపుదాం! తద్వారా ప్రజా ఉద్యమాలతో మమేకమవుదాం, విమలక్క ఆడిన ఆటలకు పాదం కలుపుదాం, తద్వారా ప్రజా ఉద్యమాల సాంస్కృతిక సారదులుగా నిలబడుదాం, విమలక్కనే కాదు మొత్తం తెలుగు సమాజాన్ని, భారతదేశాన్ని ఉర్రుతలూగించిన జానపద సంపదతో, లెక్కలేనన్ని కళారూపాలతో, మమేకమవుతూ, ఈనెల 26,27,28 తేదీల్లో 50 గంటల పాటు హైదరాబాదులో జరిగే ప్రజాకళా జాతరలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థి, మేధావులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎఫ్ టి యు ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుంచే అంజిబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం జిల్లా నాయకులు కె.రామలింగేశ్వర రావు, పి డి ఎస్ యు (వి)రాష్ట్ర కార్యదర్శి కే. సతీష్, రంగవల్లి నగర్ ప్రజలు జాను, సూరిబాబు, లక్ష్మణ్ రావు, రమేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# గుర్రప్పాలెంలో భారీ అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 16 :** జగ్గంపేట మండలం గుర్రప్పాలెం గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి ఉత్సవాలు సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణుని గుడి వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. గత 18 సంవత్సరాలుగా యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి పురస్కరించుకొని అన్నదానం నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీ స్వామి వివేకానంద స్కూల్ అధినేత ఒమ్మి రఘురాం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే భారీ సంఖ్యలో ప్రజలు అన్నదానంలో పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో వ్యాపార ఆలోచనలకు 'స్పార్క్ 7.0'

**ఆదిత్య యూనివర్సిటీలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ట్రైనింగ్ బూట్‌క్యాంప్ ప్రారంభం**



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ ,16:**గండేపల్లి మండలం, సూరంపాలెం: విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణలు, వ్యాపార దృక్పథాన్ని పెంపొందించేందుకు ఆదిత్య యూనివర్సిటీలో 'స్పార్క్ 7.0' ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ట్రైనింగ్ బూట్‌క్యాంప్ బుధవారం ప్రారంభమైంది. ఆదిత్య యూనివర్సిటీ, రాజమహేంద్రవరంలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 16 నుంచి 22 వరకు నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు స్టార్టప్‌ల ఏర్పాటు, వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేయడం, ఆవిష్కరణలు, వ్యాపార ప్రణాళిక తయారీ, సమస్యలకు సాంకేతిక పరిష్కారాల అన్వేషణ, వ్యాపార అవకాశాలను గుర్తించడం వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను నిపుణుల ముందు ప్రదర్శించి, వాటి అమలు సాధ్యత, ఉపయోగం, భవిష్యత్ అవకాశాలపై సూచనలు, సలహాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే నైపుణ్యాలతో పాటు ఆవిష్కరణలపై ఆసక్తి, వ్యాపార దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ బూట్‌క్యాంప్ ద్వారా విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు అవసరమైన నైపుణ్యాలు అందించి, భవిష్యత్‌లో విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుందని డా. శ్రీనివాస రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ కె. రవీంద్ర సిద్ధార్థ, డీన్ డా. జి. సంజీవ్ రావు, కోఆర్డినేటర్ ఏ. కళ్యాణ్ చక్రవర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.



**సామర్లకోట.. పెన్ పవర్.. సెప్టెంబర్...16...** ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు 50 సంవత్సరాల కే ఫించన్ అందచేస్తామని చెప్పి నేడు మాట తప్పారని మాజీ కౌన్సిలర్ నేతల హరిబాబు, చిట్టిమాని శ్రీవాసరావు లు పేర్కొన్నారు.సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు చెంది 50 సంవత్సరాలు నిండిన పలువురు తో కలిసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చెయ్యాలని దానిలో భాగంగా 50 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీలకు ఫించన్ లు అందచేయాలని డిమాండ్ చేశారు..అలాగే పలువురు అర్హులైన లబ్ధిదారులకు సైతం మ్యాపింగ్ సాకుతో ఫించన్ అందచేయడం లేదని దీనిపై అధికారులు స్పందించి అర్హులైన వారికి ఫించన్ అందేవిధంగా చర్యలు చేపట్టాలని వారు.కోరారు.ఈ కార్యక్రమంలో మన్యం చంద్రరావు,కరణం రాజ్.కుమార్,రెడ్డి వాసు,చిట్టిమాని శ్రీను తదితరులు పాల్గొన్నారు

# గోవింద నామస్మరణతో మార్మోగిన రామయ్యపాలెం



గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 16 గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామంలోని శ్రీ సీతారామ ఆలయం వద్ద

**వెంకటేశ్వర స్వామి రథయాత్ర.. భక్తులకు సనాతన ధర్మంపై అవగాహన**

వెంకటేశ్వర స్వామివారి రథయాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన సనాతన హిందూ ధర్మ ప్రచార ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. అనంతరం శ్రీ సీతారామ ఆలయంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. రథసారథి కరుటూరి వెంకట శ్రీనివాసరావు అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. భక్తులు భక్తి పారవశ్యంతో కీర్తనలు ఆలకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్సంగంలో సనాతన సంప్రదాయాలు, భారతీయ సంస్కృతి, ఆచార వ్యవహారాల పరిరక్షణపై భక్తులకు అవగాహన కల్పించారు. యువత సంప్రదాయాలు, సంస్కృతిని గౌరవిస్తూ వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని వివరించారు. పిల్లలను చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని, భగవద్గీత వంటి ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేసేలా యువతను ప్రోత్సహించాలని సూచించారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుతూ వాటి విశిష్టతను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు జాబితాపై పార్టీలతో సమావేశం

**ముసాయిదా పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా ప్రక్రియపై వివరణ**



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 16:**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ముసాయిదా పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా ప్రచురణ ప్రక్రియపై కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు జడ్పీ సీఈవో లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారుల సన్నద్ధత, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ముసాయిదా పోలింగ్ కేంద్రాల ప్రకటన, ఓటరు జాబితా ప్రచురణకు సంబంధించిన విధివిధానాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారులు వివరించారు. ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని జడ్పీ సీఈవో లక్ష్మణరావు కోరారు. జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రక్రియకు సంబంధించి ఏవైనా సూచనలు లేదా అభ్యంతరాలు ఉంటే నిబంధనల ప్రకారం తెలియజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో శ్రీలలితతో పాటు ఆప్ ప్రతినిధి ఎన్.శివ, బీఎస్పీ ప్రతినిధి ఎస్.రాజు, భాజపా ప్రతినిధి కె.సునిల్‌కుమార్, సీపీఐ(ఎం) ప్రతినిధి కె.వీరబాబు, కాంగ్రెస్ ప్రతినిధి పి.శ్రీను, జనసేన ప్రతినిధి ఎ.సత్యనారాయణ, తెదేపా ప్రతినిధి జి.సాయిబాబా,వైఎస్సార్‌సీపీ ప్రతినిధి ఆర్.వెంకటేశ్వరరావు,ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల నిరసన.



**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** దీర్ఘకాలిక నెలకొన్న తన సమస్యలను పరిష్కరించాలంటూ తాసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు బుధవారం నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో వీఆర్ఏలకు జీతాలు పెంచాలని,తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ నిరసనలో వీఆర్ఏల ఐక్యత వర్ధిల్లాలి,వీఆర్ఏలకు జీతాలు పెంచాలని నినాదాలు చేశారు. మండల వీఆర్వోలు వీఆర్ఏల న్యాయ పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు, రేషన్ కార్డులు,ప్రకృతి విపత్తులు,మృతదేహాల వద్ద విధులు,సర్వేలు,రీసర్వేలు,అగ్ని ప్రమాదాలు తదితర ప్రతి కార్యక్రమంలో రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు 24 గంటలూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ,గత కొన్ని సంవత్సరాలుగా కనీసం ఒక్క డీఏ కూడా లేకుండా కేవలం రూ. 10 వేల జీతంతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 10 వేల జీతంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం తమను పెన్షనర్లుగా పరిగణిస్తోందని,తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలకు జీతాలు పెంచడంతో పాటు తండ్రి మరణించినప్పుడు ఆయన స్థానంలో విధులు నిర్వహించే కుటుంబ సభ్యులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## సీడ్ బాల్స్‌తో ఓజోన్ వినాయకుడి తయారీ

**పర్యావరణ పరిరక్షణపై ర్యాలి ఫౌండేషన్ పాఠశాల చిన్నారుల వినూత్న అవగాహన**



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 16 :**ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలి ఫౌండేషన్ పాఠశాలలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో ఒకటి, రెండో తరగతి చదువుతున్న చిన్నారులు బుధవారం స్వయంగా సీడ్ బాల్స్ తయారు చేసి, వాటితో ó3 ఆకారంలో ఓజోన్ వినాయకుడిని రూపొందించారు. ప్రకృతి పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, మొక్కల ప్రాధాన్యతను చిన్నతనం నుంచే విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సీడ్ బాల్స్ తయారీలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాటు, వాటి ద్వారా విత్తనాలను వివిధ ప్రాంతాల్లో విస్తరించే విధానాన్ని ఆచరణాత్మకంగా తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ పర్యవేక్షణలో విద్యార్థులు ఖాళీ ప్రదేశాల్లో, తమ ఇళ్ల పరిసరాల్లో సీడ్ బాల్స్‌ను విసిరారు. విత్తనాల ద్వారా మొక్కలు పెరిగి పచ్చదనం అభివృద్ధి చెందేందుకు దోహదపడే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓజోన్ పొర ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. చిన్నారులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములుగా తీర్చిదిద్దే దిశగా పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆకట్టుకుంది.



## అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన

**గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆహార వైవిధ్యంపై సూచనలు**



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 16:**మన అంగన్వాడి -- మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీవో ఏ. గజలక్ష్మి ఆధ్వర్యంలో రాఖవరం ఎలిమెంటరీ స్కూల్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం లబ్ధిదారులకు వెయిటింగ్ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. పద్మావతి పర్యవేక్షణలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. మొదటి వారం థీమ్‌లో భాగంగా ఆహార వైవిధ్యం, తగినంత ప్రోటీన్ తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కూరగాయలు, పండ్లు, విత్తనాలు, పాలు, పాల పదార్థాలు, గుడ్లు వంటి వివిధ ఆహార వనరులను రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం, పోషక పదార్థాల ప్రాధాన్యతను వివరించారు. సీజనల్‌గా లభించే పండ్లను తరచుగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని తెలిపారు. పీపీపీ, ఐవీఆర్ కాల్స్ ద్వారా అందించే ఆరోగ్య, పోషకాహార సమాచారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సూచనలను నిరంతరం అందించాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కె. శాంతిశ్రీ, నాగలక్ష్మి, వి. దుర్గమ్మ, ఏఎన్ఎం పద్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. పోషకాహారంపై అవగాహన కార్యక్రమాల ద్వారా లబ్ధిదారుల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

## అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి కి భక్తుల విరాళాలు

**వినాయక చవితి సందర్భంగా ఆలయ అభివృద్ధి, అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ.1,20,232 విరాళాలు**





**అయినవిల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 16:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలంలోని ప్రసిద్ధ శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దర్శనానికి వినాయక చవితి సందర్భంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. స్వామివారి సన్నిధిలో నిర్వహిస్తున్న అన్నప్రసాద కార్యక్రమానికి భక్తులు భక్తిశ్రద్ధలతో విరాళాలుసమర్పిస్తున్నారు. రావులపాలెం గ్రామానికి చెందిన పెరవలి వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ఆలయ అభివృద్ధి పనులకు రూ. 10,000 విరాళంగా అందజేశారు. చింతనలంక గ్రామానికి చెందిన పోతుల సత్యనారాయణ కుటుంబ సభ్యులు శ్రీ విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ. 10,116 విరాళంగా సమర్పించారు. కానూరు గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి హేమ రామ్ రెడ్డి, ప్రియాంక దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ. 1,00,116 విరాళంగా అందించారు. ఈ మూడు విరాళాల ద్వారా మొత్తం రూ. 1,20,232 విరాళం సమకూరింది. ఆలయ ప్రధాన అర్చకులు దాతలకు వేద ఆశీర్వచనం అందించి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణ రాజు స్వామివారి చిత్రపటాలను అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ విళ్ళ సూర్యనారాయణ దాతలకు అభినందనలు తెలిపారు.
వినాయక చవితి సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు భక్తులు అందిస్తున్న విరాళాలు సహకరిస్తున్నాయి. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, అన్నప్రసాద నిర్వహణకు భక్తుల సహకారం కొనసాగుతోంది.

## ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు**



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 16:**భూమిపై జీవరాశుల మనుగడకు కీలకమైన ఓజోన్ పొరను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్.నాయుడు అన్నారు. ఓజోన్ డే సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. డాక్టర్ నాయుడు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడాన్ని బాధ్యతగా స్వీకరించాలని విద్యార్థులకు సూచించారు. ఓజోన్ పొర పరిరక్షణపై విద్యార్థులు అవగాహన నినాదాలు చేశారు. అనంతరం మొక్కల సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని డాక్టర్ నాయుడు తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన అధ్యాపకులు,విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి,డిగ్రీ కళాశాలల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# పోషకాహార లోపాన్ని నివారిద్దాం

**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 6:**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పోషణ్ 2026 ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో తరచూ నెలకొంటున్న పోషకాహార లోపాన్ని నివారిద్దామని కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్మి అన్నారు. పోషణ్ 2026 మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోనున్న ఆలమూరు, నర్శిపూడి, చెముడులంక సెక్టార్ల పరిధిలోని పలు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు చిన్నారులకు బాలసంజీవినీ కిట్లు, బాలామృతం ప్యాకెట్లను అందజేస్తున్నామన్నారు. అలాగే బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తున్నామన్నారు. దీంతోపాటు ప్రతి ఒక్కరు కూరగాయలు, పప్పు దినుసులు, మాంసకృతులు ఉండే ఆహార పదార్థాలను భుజించాలన్నారు. అలాగే అనునిత్యం లభించే మునగాకు కూరను క్రమం తప్పకుండా స్వీకరించాలని ఆమె సూచించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్లు పి.నాగ సత్యవేణి, బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## పట్టణ మౌలిక వసతుల పనులు సకాలంలో పూర్తి చేయాలి

కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 16:పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, మురుగునీటి




శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు), రహదారులు, వీధిలైట్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ప్రజారోగ్య సంస్థల అధికారులతో నిర్వహించిన సమీక్షలో వివిధ గ్రాంట్ల కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు.ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించి సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని, వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఇంటింటి చెత్త సేకరణను వందశాతం చేపట్టడంతో పాటు చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా శుభ్రపరచాలన్నారు. ఎస్టీపీల నిర్వహణ, లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.వివిధ గ్రాంట్ల కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి జనవరి నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయడంలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలకు పకడ్బందీ ఏర్పాట్లు





**కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 16:**సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు జిల్లాలో నిర్వహించనున్న 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఇళ్లతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సెప్టెంబర్ 18న యువత కోసం స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గోడలపై చిత్రాలు,వివిధ పోటీలు, స్వచ్ఛత జ్ఞాన్ యాత్ర, ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.మార్కెట్లు,చేపల మార్కెట్లు,సామూహిక మరుగుదొడ్లు, ఉద్యానవనాలు,పర్యాటక ప్రాంతాలు, దేవాలయాల్లో నిరంతర పరిశుభ్రతను పర్యవేక్షించాలని తెలిపారు.అక్టోబర్ 2న మహా శ్రమదాన్ నిర్వహించడంతో పాటు, ప్లాస్టిక్ నిషేధం,ఇంటివద్ద కంపోస్టు తయారీ,నీటి వనరులు, కార్యాలయాల పరిశుభ్రత తదితర కార్యక్రమాలను దశలవారీగా చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ కోసం క్షేత్రస్థాయిలోని లోపాలను ఇప్పటి నుంచే సరిదిద్దాలని సూచించారు.సమావేశంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు,డీపీవో వి.రవికుమార్,డీఈవో పి.రమేష్, కాకినాడ కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికలకు ప్రణాళిక విడుదల

### గండేపల్లి మండలంలో 41 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 16** మండలంలోని 41 ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల అభివృద్ధి కమిటీల ఎన్నికలకు సంబంధించిన ప్రణాళికను విడుదల చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కె.హెచ్. నాయక్ తెలిపారు. సెప్టెంబర్ 15న ఎన్నికల ప్రణాళికను విడుదల చేసి, ప్రతి పాఠశాలలో నోటిఫికేషన్‌ను ప్రకటించినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 18న ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. అనంతరం సెప్టెంబర్ 25న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. సెప్టెంబర్ 29న పాఠశాల అభివృద్ధి కమిటీల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆయా పాఠశాలల్లో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



## పర్యావరణ పరిరక్షణతో ఓజోన్ పొరకు రక్షణ: ప్రిన్సిపాల్ డాక్టర్ డి .సునీత.






**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** పర్యావరణ పరిరక్షణ తో ఓజోన్ పొరకు రక్షణ ఏర్పడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సునీత అన్నారు.ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు యు. ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో ఓజోన్ పొర ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. సునీత పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓజోన్ పొర యొక్క ప్రాముఖ్యతను, దాని ఉపయోగాలు, ఓజోన్ క్షీణతకు కారణాలు, దాని ప్రభావాలు , ఓజోన్ పొర పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు. ఓజోన్ పొర అనేది సుమారు భూమికి 15 నుండి 35 కిలోమీటర్ల ఎత్తులో కనిపిస్తుందని, భూమి పై స్ట్రాటో ఆవరణంలో ఉండి, సూర్యుని నుండి వచ్చే హానికరమైన అతినీలలోహిత వికిరణాన్ని గ్రహించి, జీవులను కాపాడే ఒక రక్షణ కవచం ఓజోన్ పొర రక్షిస్తుంది. ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేయడం వల్ల క్లోరోఫ్లోరోకార్బన్‌లు వాతావరణం లో కలిసి ఓజోన్ కొరకు తూట్లు పొడుస్తాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏరోసోల్ స్ప్రేలు, కొన్ని రకాల ఫ్రిజ్‌లు, పరిశ్రమలు, మోటారు వాహనాల నుండి వెలువడే కాలుష్యం వల్ల ఓజోన్ క్షీణత ఏర్పడిందని , ఓజోన్ పొరలో ఏర్పడే క్షీణత వల్ల చర్మ క్యాన్సర్, కంటి శుక్లాలు (క్యాటరాక్ట్స్), చర్మం వృద్ధాప్యం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని ,మానవ ఆరోగ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థలు, పంటలకు, సముద్ర జీవులకు, వృక్షజాలం, జంతుజాలంపై ప్రతికూల ప్రభావాలు కలిగే అవకాశం ఉందని వివరించారు. అయితే అంతర్జాతీయ ఒప్పందాల వల్ల ఇది కోలుకుంటోందని. ఓజోన్ పొరను దెబ్బతీసే పదార్థాల వాడకాన్ని తగ్గించడానికి 1987లో ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు మాంట్రియల్ ప్రోటోకాల్‌పై సంతకం చేశాయిని. పర్యావరణానికి హాని చేయని ప్రత్యామ్నాయాలను ఉపయోగించడం, సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించడం, మొక్కలు నాటడం, చెట్లను నరకకుండా చూడటం వంటివి ఓజోన్ పొరను రక్షించడంలో సహాయపడతాయని, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచడం అవసరమని కాబట్టి యువతలైన విద్యార్థులు ఓజోన్ పొర పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె. వేంకటేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ, అధ్యాపకులు ఐ. ప్రవీణ్ కుమార్, డా. మదీనా, డా. శివ ప్రసాద్, శ్రీ లక్ష్మి, డా. బంగార్రాజు, సతీశ్, కుమారి మేరీ రోజలీనా,పుష్పా, జె సత్యవేణి, యేసు మరియు అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## డేటా భద్రతపై అవగాహన అవసరం

**ఆదిత్య విశ్వవిద్యాలయంలో 'ది సీక్రెట్ లైఫ్ ఆఫ్ యువర్ డేటా'పై అతిథి ఉపన్యాసం**



**గండేపల్లి, పెన్ పవర్: సెప్టెంబర్ ,16** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో డిజిటల్ యుగంలో వ్యక్తిగత, సంస్థాగత సమాచారాన్ని భద్రంగా పరిరక్షించుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆదిత్య విశ్వవిద్యాలయంలో అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్సెస్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ది సీక్రెట్ లైఫ్ ఆఫ్ యువర్ డేటా', 'జీరో ట్రస్ట్ టు జీరో బ్రీచ్' అంశాలపై ఈ కార్యక్రమం జరిగింది. ఎవర్నార్త్ సంస్థ ఇన్ఫర్మేషన్ ప్రొటెక్షన్ మేనేజర్ చైతన్య ఎమానీ ముఖ్య వక్తగా పాల్గొని డేటా భద్రత, సమాచార పరిరక్షణ, సైబర్ భద్రత, డేటా ఉల్లంఘనలను నివారించే విధానాలపై విద్యార్థులకు వివరించారు. డిజిటల్ సమాచారాన్ని నిర్లక్ష్యంగా వినియోగించడం వల్ల ఎదురయ్యే భద్రతా సమస్యలు, వాటిని ముందుగానే గుర్తించి నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ విలాస్ అనిల్ చవాన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు పి.వి. నాగేశ్వరరావు, సవియన్ షకీర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో డిజిటల్ డేటా భద్రత, సమాచార పరిరక్షణ, సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## స్థానిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సన్నద్ధం

**మండల టీడీపీ విస్తృత సమావేశంలో పోతుల మోహనరావు**



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పోతుల మోహనరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల కోసం పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో తీర్మానించినట్లు పోతుల మోహనరావు తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ కూటమి భాగస్వామ్య పక్షాలు స్థానిక ఎన్నికల కోసం సమన్వయంపై దృష్టి సారిస్తున్నాయి.

అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని, హౌసింగ్ రుణాలు, ఇళ్ల స్థలాల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను అర్హులకు అందేలా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పోతుల మోహనరావు పేర్కొన్నారు. అమరావతి, పోలవరం, రహదారులు, మౌలిక వసతులు, పెట్టుబడుల వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి జాస్తి వసంత్, యూనిట్ ఇన్‌చార్జి ఇప్పర్ల సురేష్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ, మండల టీడీపీ యువత అధ్యక్షుడు సుంకవిల్లి రమేష్, రామయ్యపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు మైలవరపు శ్రీనివాస్‌తో పాటు కంటిపూడి రామయ్య, వెంపాటి రాజు, ఆళ్ల సత్తిబాబు, పైల వెంకన్న, చిటికెల కన్నబాబు, ముంగర విష్ణుమూర్తి, ఉండవిల్లి రాధాకృష్ణ, వెంపాటి రాంబాబు, మాచిన బాబురావు, నాలం వీరబాబు, దార కాటయ్య, గరిగిపాటి రమణ, గుర్రం శేఖర్, పైల రమణ, గునిపెల్లి వీరబాబు, పెనుగాడి నాగరాజు, యాక నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ తోపాటు పోలీసులు ఉక్కుపాదం.

- **కృష్ణవరం టోల్‌గేట్ వద్ద 96 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత.**
- **బియ్యంతోపాటు రెండు వాహనాలు సీజ్..**



**కిర్లంపూడి, పెన్ పవర్,సెప్టెంబరు,16:**కిర్లంపూడి పోలీసులు, విజిలెన్స్ అధికారులు సమన్వయంతో అక్రమ రేషన్ బియ్యం రవాణాపై ఉక్కుపాదం మోపారు. కృష్ణవరం టోల్‌గేట్ వద్ద సోమవారం ఉదయం నిర్వహించిన తనిఖీల్లో రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 96 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ బడా దోస్త్, బొలెరో వాహనాలను సీజ్ చేసి కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై 6 ఏ కేసు నమోదు చేసి తదుపరి చర్యలకు పౌరసరఫరాల అధికారులకు రేషన్ బియ్యాన్ని అప్పగించేందుకు చర్యలు చేపట్టారు.రాజమండ్రి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సోమవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో కృష్ణవరం టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా అడ్డతీగల నుంచి జగ్గంపేటకు, ఎర్రవరం నుంచి జగ్గంపేట పరిధిలోని పౌల్ట్రీ ఫార్మ్‌లు, ఫిష్‌ఫార్మ్‌లు, బ్రిక్ వర్కర్లకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.4.60 లక్షలు, వాహనాల విలువ రూ.14.30 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. మొత్తం రూ.18.90 లక్షల విలువైన బియ్యం, వాహనాలు సీజ్ చేసినట్లు వెల్లడించారు. అక్రమ రవాణాకు సంబంధించి అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఉన్న మూలాలను గుర్తించడం, సరుకు ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరికి తరలిస్తున్నారు అనే అంశాలపై విచారణ చేపట్టారు.గతంలో ఇలాంటి కేసుల్లో పట్టుబడిన వాహనాలు తిరిగి అక్రమ రవాణాకు వినియోగించబడుతున్నాయా? అనే అంశంపై కూడా సంబంధిత అధికారులు దృష్టి సారిస్తున్నారు.

రాజమండ్రి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ అవినాష్, కిర్లంపూడి ఎస్సై జి. సతీష్‌కుమార్ , ఏఓ శ్రీరామ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కళాజ్యోతి, ఎంఎస్‌ఓ నాగబాబు, వీఆర్‌ఓ అచ్యుతరావు,వీర్రాజుతో పాటు తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు. పోలీస్, విజిలెన్స్ అధికారులు సమన్వయంతో నిర్వహించిన ఈ దాడుల్లో భారీగా రేషన్ బియ్యం పట్టుబడటంతో అక్రమ రవాణాపై అధికారులు చేపడుతున్న చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం.





**పార్టీల నేతలకు స్థానిక ఎన్నికల ఓటర్ల జాబితా పోలింగ్ స్టేషన్ల వివరాలు వెల్లడించిన ఎంపీడీవో.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లా ఎన్నికల అధికారి అదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎండిఓ రామరాజు వర్మ అన్ని పార్టీల నేతలతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నేతలతో ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎంపీటీసీ, గ్రామపంచాయతీల ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లను, ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. తాము ప్రచురించిన పోలింగ్ స్టేషన్లు, ఓటర్ ల జాబితాలు పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల అధికారులు ప్రకటించిన వివరాల ప్రకారం ఏలేశ్వరం మండలంలో 12 గ్రామపంచాయతీలలో 37492 ఓటర్లు ఉండగా 140 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. వీటిలో భద్రవరం గ్రామంలో 1962 మంది ఓటర్లు 10 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అలాగే సి రాయవరం లో 787 ఓటర్లకు గాను 8 పోలింగ్ స్టేషన్లు, తూర్పు లక్ష్మీపురం 1441 ఓటర్లకు 10 పోలింగ్ స్టేషన్లు, జె. అన్నవరం 2659 ఓటర్లు 12 పోలింగ్ స్టేషన్లు, లింగంపర్తి 8314 ఓటర్లు 16 పోలింగ్ స్టేషన్లు, మర్రి వీడు 2563 ఓటర్లు 12 పోలింగ్ స్టేషన్లు, పెద్దనాపల్లి 4814 ఓటర్లు 14 పోలింగ్ స్టేషన్లు, పేరవరం 2348 ఓటర్లు 10 పోలింగ్ స్టేషన్లు, రమణయ్యపేట 1262 ఓటర్లు 10 పోలింగ్ స్టేషన్లు, సిరిపురం 3292 ఓటర్లు 12 పోలింగ్ స్టేషన్లు, తిరుమాలి 3548 ఓటర్లు 12 పోలింగ్ స్టేషన్లు, యర్రవరం4502 ఓటర్లకు 14 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం సిద్ధం చేసిన వాటర్ జాబితా పోలింగ్ స్టేషన్లో పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలియజేయాలని ఎండిఓ రామరాజు వర్మ నాయకులకు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి పార్టీ నుంచి గొల్లపల్లి నరసింహమూర్తి, మైరాల కనకారావు, జనసేన పార్టీ నుండి పెంటకోట మోహన్, గంగిరెడ్ల మణికంత, వైసీపీ నుంచి గొల్లపల్లి సురేష్, గొంతిన సురేష్, బిజెపి నుండి గునిశెట్టి శ్రీనివాస్, గట్టెం వెంకటరమణ తదితర పార్టీ ప్రతినిధులతో పాటు నాయకులు పాల్గొన్నారు.



**సామర్లకోట.. పెన్ పవర్... సెప్టెంబర్.16..**సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ఫిబ్రవరి లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో మృతి చెందిన పలువురు.కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అందించే ఎన్.టి.ఆర్ భరోసా ఫించన్లు అందడంలేదనీ సామర్లకోట కుమ్మరివీధికి చెందిన ఏడిద శ్రావణి,దర్శిపాటి రాజేశ్వరి,కాతేటి రోజా లు ఆవేదన వ్యక్తం చేశారు తమ భర్తలు అగ్నిప్రమాదం లో మృతి చెంది 7 నెలలు కావస్తున్నా తమకు ఫించన్ అందడంలేదని అన్నారు.అయితే ఇప్పుడు నూతన ఫించన్ ల కు దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వెళ్లగా మ్యాపింగ్ అవ్వడం లేదని పేర్కొంటున్నారని పేర్కొన్నారు..తమకు వేరు గా రేషన్ కార్డులు.ఉన్నప్పటికీ మ్యాపింగ్ కారణంతో తమకు ఫించన్ మంజూరు చేయడంలేదని దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమ ను ఆదుకోవాలని వారు కన్నీటి పర్యంతమయ్యారు

## శంఖవరం పాలక మండలి వీడ్కోలు సభ....



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 16:-** శంఖవరం మండల పరిషత్ పాలకమండలి ఈ నెల 23తో రద్దు అవుతున్న నేపథ్యంలో మండల పరిషత్ తుది సమావేశం, పాలకమండలి వీడ్కోలు సభ మండల కేంద్రం శంఖవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిటిసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజబాబు అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో తొలుత కొంతంగి ఎంపిటిసి నడిగట్ల నానాజీ మృతికి సంతాపంగా పాలకమండలి సభ్యులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళు లర్పించారు. అనంతరం పలు శాఖల అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికను సమావేశానికి వివరించారు. అనంతరం ఎంపీపి రాజబాబు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ళ తన పదవీకాలం సజావుగా సాగించేందుకు తనకు అన్ని విధాలుగా, తనపై నమ్మకంతో ఎంతగానో సహకరించిన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. తాము అధికార పార్టీలో ఉన్నా... లేకున్నా... కొన్ని కారణాలతో నిధులు కేటాయింపులో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చిందన్నారు. ఏదిఏమైనా తన పదవీ కాలం సజావుగా సాగేందుకు అందరి సహకారం మరువలేనిదని రాజబాబు పేర్కొన్నారు. వైస్ ఎంపీపి ధారా వెంకటరమణ మాట్లాడుతూ ఐదేళ్ళలో ప్రజలు, అధికారులతో మమేకమై ఉండడంతో అందరితో ఏర్పడిన పరిచయాలు, వారందించిన సహకారాలు మరువలేనివన్నారు. అజాత శత్రువుగా పేరొందిన మన ఎంపిపి రాజబాబు మండలంలో వివాదాలకు దూరంగా, ప్రజలకు చేరువగా పాలన సాగించారన్నారు. వైస్ ఎంపీపి 2 ఈగల చిన్నమ్ములు అప్పారావు మాట్లాడుతూ ఎంతో గౌరవప్రదమైన ఎంపిటిసి పదవికి ప్రభుత్వం ఇచ్చే కనీస గౌరవ వేతనం కూడా పొందలేకపోయామని, ఎంపిటిసిలకు ఆయా వార్డుల అభివృద్ధికి కనీస అభివృద్ధి నిధులు కేటాయింపులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తన పరిధిలో వాటర్ ట్యాంకు ప్రారంభోత్సవానికి ప్రొటోకాల్ పాటించకపోవడం పట్ల అర్ డబ్ల్యుఎస్ ఎఇ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎంపీటిసి దడాల సతీష్ మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఎంపిటిసీలుగా ఎన్నికై అధికారంలో ఉన్నా... లేకున్నా... పార్టీని వీడని గొప్ప రాజకీయ నీతిజ్ఞులు మన ఎంపిటిసీలేనని అన్నారు. సమావేశం ముగింపులో ఎంపీపి రాజబాబు మాట్లాడుతూ శంఖవరం గ్రామానికి త్వరితగతిన బైపాస్ రహదారిని నిర్మించాలని, శంఖవరం మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం ఎంపిడిఓ నాగేంద్ర, డిప్యూటి ఎంపిడిఓలు పుష్యమి కీర్తి, నాగలక్ష్మి, వెంకయ్యమ్మ, తహశీల్దార్ ఎం సూరిబాబు, ఆయా శాఖల అధికారులు ఎంపిపి రాజబాబును, పాలకమండలి సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్వి రమణ, ఏపిఎం శ్రీనివాస్, ఏపీఓ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి గాంధీ, సిడిపిఓ వెంకటలక్ష్మి, మండల వైద్యాధికారి ఎస్ఎస్ రాజీవ్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓజోన్ ను కాపాడడం మన బాధ్యత

**ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి,బాలమందిరం కన్వీనర్ కృష్ణ శ్రీ పిలుపు**

**అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆలమూరు జూనియర్ కళాశాల విద్యార్థుల ర్యాలీ**





**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**ఓజోన్ పొరను కాపాడటం మన బాధ్యతని, ఓజోన్ పొర దెబ్బతింటే మానవాళి వినాశనం తప్పదని కళాశాల ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి, బాలమందిరం కన్వీనర్ కృష్ణశ్రీ పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల మందిరం కన్వీనర్ కృష్ణ శ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని, మొక్కలు నాటి చెట్లను పెంచాలని ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతగా వ్యవహరించడం ద్వారా సమాజ శ్రేయస్సుకు దోహదపడిన వాళ్లమవుతామన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కైనా నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు కొత్తూరు సెంటర్ వరకు ఓజోన్ పరిరక్షణ మన బాధ్యత, గ్లోబల్ యాక్షన్ ఫర్ కూలర్ ప్లానెట్, చల్లని భూమి కోసం కలిసి పని చేద్దాం అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు సెంటర్లో మానవహారం ఏర్పరిచి నినాదాలు చేశారు. అనంతరం కళాశాల వద్ద ఓజోన్ ఫార్ములా ఓ3 రూపంలో కూర్చొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో వెన్నుపోటు ప్రభుత్వం, పాలనపై వైసీపీ పోరు



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెన్నుపోటు ప్రభుత్వం.. వెన్నుపోటు పాలనపై పోరు కార్యక్రమాన్ని బుధవారం జగ్గంపేట సాయి బాలాజీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. హామీల అమలుపై ప్రజల్లో ఆవేదన, అసంతృప్తి నెలకొన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని తోట నరసింహం విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ విధానాలను వివరిస్తాయని తోట నరసింహం తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సర్పంచ్ తదితర స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ తరపున అభ్యర్థులను బరిలోకి దింపుతామని చెప్పారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ విద్యార్థి విభాగం జోన్ 2 వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట మండల వైసీపీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, కరుటూరి వీర్రాజు, చలగల దొరబాబు, గుల్ల ఏడుకొండలు, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహారాణి కాలేజీలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో విద్యార్థులకు అందించిన సదుపాయాలు,



**పెద్దాపురం.. పెన్ పవర్... సెప్టెంబర్...16..** చేపట్టిన కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు పరిచయ కార్యక్రమం నిర్వహించారు.టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి రాజా సూరిబాబు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కాకినాడ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత రెండు సంవత్సరాల కాలంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి తీసుకున్న చర్యలు, వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాల గురించి నాయకులు వివరించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా సంబంధిత సమస్యలు, కళాశాలలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అవసరమైన సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిప

## ప్రధాని మోదీ జన్మదిన వేడుకలకు సిద్ధం

**నేడు ఇర్రిపాకలో ఏలేరు తీరాన వెయ్యి దీపాలతో దీపోత్సవం**

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గంపేట నియోజకవర్గంలో భారీ వేడుకలకు బీజేపీ శ్రీకారం చుట్టింది. జగ్గంపేట బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి దాట్ల కృష్ణ వర్మ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. గురువారం సాయంత్రం జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఏలేరు నది తీరాన ఉన్న శివాలయం వద్ద వెయ్యి దీపాలతో మహా దీపోత్సవం నిర్వహించి మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తామన్నారు. ఇది కేవలం బీజేపీ కార్యక్రమం మాత్రమే కాదని కూటమి బలాన్ని చాటే వేడుక అని, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి ఈ దీపోత్సవాన్ని విజయవంతం చేయాలని దాట్ల కృష్ణ వర్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 16 :** ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ముసాయిదా జాబితాపై బుధవారం జగ్గంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీవో చంద్రశేఖర్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వైసీపీ, బీఎస్పీ, జనసేన, తెలుగుదేశం పార్టీల నుంచి రాజకీయ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీల ప్రతినిధులు ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాను పరిశీలించి ఎటువంటి అభ్యంతరాలు లేవని తెలిపారని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలియజేశారు.


## 43 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక



**రామచంద్రపురం, పెన్‌పవర్, సెప్టెంబర్ 16:**రామచంద్రపురం పట్టణం 5వ వార్డు రాజబాబునగర్‌కు చెందిన 43 మంది వైసీపీ కార్యకర్తలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తాతపూడి సుబ్బారావు, వైసీపీ టౌన్ సెక్రటరీ కొమ్మనాపల్లి బుజ్జి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సుభాష్ నూతనంగా పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి సుభాష్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు తెలిపారు.మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత రెండేళ్లలో రామచంద్రపురం పట్టణంలో సుమారు రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు.ఈ సందర్భంగా రాజబాబునగర్ వాసులు తమ కాలనీలోని స్మశానవాటికకు ప్రహరీ గోడ, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి స్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి తక్షణమే అనుమతి మంజూరు చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవల్లి శివ, క్లస్టర్--2 కన్వీనర్ కంచుమర్తి బాబురావు, కో--క్లస్టర్ ఏసుదాసు, కాటే సుబ్రహ్మణ్యం, కూటమి పార్టీల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పదవుల కోసం మతం మార్చుకున్నారు!! - విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:** విపక్షం వైసీపీని లక్ష్యంగా చేసుకుని మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి చేస్తున్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. కొత్త రాజకీయ పార్టీ పెడతానని కొన్నిరోజులుగా చెబుతున్న విజయసాయిరెడ్డి సమయం, సందర్భం లేకుండా విపక్షంపై ఘాటు విమర్శలతో విరుచుకుపడుతుండటం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. కొత్త పార్టీ ప్రారంభిస్తానని గతంలో ప్రకటించిన సందర్భంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై మత మార్పిడి ఆరోపణలు చేసిన విజయసాయిరెడ్డి తాజాగా రెండేళ్ల క్రితం నాటి ఒక వీడియోను షేర్ చేశారు. వైసీపీలో ఎమ్మెల్యే, మంత్రి పదవులు పొందాలంటే జగన్ ను ఆకట్టుకునేందుకు మతం మార్చుకోవాల్సివచ్చేదని ఆరోపించడమే కాకుండా, ఇలా ఎంతోమంది మార్చుకున్నారో వైసీపీలో నెంబర్ వన్ చెప్పాలంటూ పోస్టు పెట్టారు.రెండేళ్ల క్రితం ఏపీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారపురెడ్డి చంద్రశేఖరరెడ్డి ప్రసంగించిన వీడియోను విజయసాయిరెడ్డి తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. "వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక మాజీ, సీనియర్ ఎమ్మెల్యే 2024 ఎన్నికల ముందు చేసిన ఈ ప్రసంగంపై రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ అభిప్రాయం తెలియజేయాలి" అంటూ కోరారు. అంతేకాకుండా "గతంలో ఎంతమంది నాయకులు తమ ఎమ్మెల్యే టికెట్ల కోసం, ఆ తర్వాత ప్రభుత్వంలో మంత్రి పదవుల కోసం జగన్ గారిని ఆకట్టుకునేందుకు మతం మార్చుకున్నారో ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌లో నంబర్ వన్ సమాధానం చెప్పాలని కోరుతున్నా." అంటూ రాశారు.



ఉన్నట్టుండి విజయసాయిరెడ్డి చేసిన ఈ పోస్టు రాష్ట్ర రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీస్తోంది. సహజంగా రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలకు తగిన సమయం సందర్భం ఉంటుందని, కానీ ఇప్పుడు ఎలాంటి చర్చ లేని మత మార్పిడుల అంశాన్ని విజయసాయిరెడ్డి తెరపైకి తేవడం వెనుక ఆయన ఉద్దేశం ఏమైవుంటుందో అర్థం కావడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయ పార్టీ పెట్టాలని భావిస్తున్న విజయసాయిరెడ్డి విపక్షంలో ఉన్న వైసీపీ స్థానంలో ఎదగాలని భావించడంలో తప్పు లేదని, కానీ ఎప్పటిదో వీడియోను బయటకు తీసి ఇప్పుడు వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయం చెప్పాలంటూ నిలదీయడమే ఆశ్చర్యంగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.వైసీపీలో తనకు అన్యాయం జరిగిందని ఆరోపణలు చేస్తున్న విజయసాయిరెడ్డి ఆ పార్టీని అధినేత జగన్మోహనరెడ్డిని రాజకీయంగా దెబ్బతీయాలనే వ్యూహంతో ఇటువంటి పోస్టులు చేస్తున్నారని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. పాత వీడియోలు బయటకు తీసి కావాల్సిన విధంగా ఎడిటింగ్ చేసుకుని వైరల్ చేయాలని చేయాలని భావించడం కరెక్టు కాదని అంటున్నారు. అదే సమయంలో ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. తన స్థానంలో పార్టీలో ఎదిగిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని చూసి ఓర్వలేకే విజయసాయిరెడ్డి ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసీపీ నేతలు మండిపడుతున్నారు.

ఇదే సమయంలో విజయసాయిరెడ్డి విమర్శలను అధికార పార్టీ హైలెట్ చేస్తోందని అంటున్నారు. కొద్దిరోజుల క్రితం వైసీపీకి చెందిన జోగి రమేష్ కుటుంబం మతం మార్చుకుందన్న విషయం వెలుగు చూడగా, మంత్రి పదవి కోసమే ఆయన మత మార్పిడి జరిగిందని ప్రత్యర్థులు ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ ప్రచారానికి బలం చేకూర్చేలా విజయసాయిరెడ్డి ప్రశ్నలు సంధిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు రాస్తుండటం ద్వారా ఒక వ్యూహం ప్రకారం వైసీపీ వ్యతిరేక రాజకీయాలు చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# జగన్ రాజకీయం చెయ్...సీనియర్లు కోరేది ఇదేనా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** అదేంటి జగన్ రాజకీయాల్లోనే కదా ఉన్నది, మళ్లీ ఇదేమిటి అన్న సందేహం రావచ్చు. అయితే జగన్ రాజకీయాల్లో ఉన్నా కూడా పక్కా వ్యూహాలతో ఎత్తుగడలతో రాజకీయం చేయాల్సిన అవసరం ఉంది అన్నదే సీనియర్ల మాట. వైసీపీ విషయం తీసుకుంటే జగన్ అధినేతగా ఉన్నారు. ఇక పార్టీ దైనందిన వ్యవహారాలు చూసేందుకు పార్టీ నుంచి వెళ్ళిపోయిన విజయసాయిరెడ్డి లాంటి వారు చెప్పే కోటరీ ఒకటి ఉందని అంటున్నారు. అన్ని విషయాలను సజ్జల రామక్రిష్ణారెడ్డి వంటి వారే చూసుకుంటున్నారు అని అంటున్నారు. ఇక జిల్లాల విషయానికి వచ్చేసరికి రీజనల్ కో ఆర్డినేటర్లను మూడేసి జిల్లాలకు నియమించారు. వారు అక్కడి విషయాలను పర్యవేక్షిస్తారు. ఇలా కొందరు సీనియర్ నేతల చేతిలో పార్టీని పెట్టేసినట్లుగా ఉందని అంటున్నారు. అక్కడ వారు ఏమి చెబితే అదే జరుగుతోందని అంటున్నారు. దాంతో జగన్ మీద వైసీపీ మీద అభిమానం ఉన్న వారు కూడా వైసీపీలో కొనసాగే పరిస్థితులు లేకుండా పోతున్నాయని అంటున్నారు.



**నేరుగా అనుసంధానం :**

అధినాయకుడు పార్టీ నాయకులకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండాలని కోరుకుంటారు. అలాగే పార్టీలో ఎక్కడ ఏమి జరుగుతుంది అన్నది కూడా ఆయన గమనిస్తూ ఉండాలని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలి అంటే ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్ నాయకుడి చెవికి చేరాలి. అయితే వైసీపీలో ఆ పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. ఎన్నో అంచెలను వైసీపీలో ఏర్పాటు చేశారు. వాటిని దాటుకుని జగన్ ని చేరడం కష్టం అవుతోంది అని అంటున్నారు. అధికారంలో ఉన్నపుడు కూడా జగన్ అపాయింట్మెంట్ చాలా మంది పెద్దలకే దొరకడం కష్టంగా మారింది అని చెబుతారు. ఇప్పుడు ఓడిన తరువాత కూడా అంతే అన్నట్లుగా ఉందని గుర్తు చేస్తున్నారు.

**పార్టీని నమ్ముకుని :**

ఒక రాజకీయ పార్టీని ఎవరైనా స్థాపించవచ్చు. అయితే ఆ పార్టీని నమ్ముకుని ఎంతో మంది చేరుతారు. వారి ఆకాంక్షలు అన్నీ కూడా పార్టీ అధినాయకత్వం పార్టీ నడిపే తీరుని బట్టే నెరవేరే అవకాశం ఉంది. అందరి అభిప్రాయాలను తెలుసుకుంటూ ఆమోదయోగ్యమైన తీరులో పార్టీని నడిపితేనే మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు. పార్టీ తీరుని మార్చుకునేందుకు నిరంతరం సమీక్షలు కూడా అవసరం అని అంటున్నారు. ఇదిలా ఉంటే వర్గ పోరు ప్రతీ జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో ఉంది. దాంతో వైసీపీ బలంగా ఉన్న చోట కూడా వీక్ అయిపోతోంది అని అంటున్నారు.

**అధినాయకత్వం జోక్యంతో :**

శ్రీకాకుళం జిల్లాలో చూస్తే ధర్మాన సోదరులే జిల్లా పార్టీ మీద మొత్తం పెత్తనం చేస్తున్నారు అని తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ ఆరోపిస్తున్నారు. ఈ ధోరణి మంచిది కాదని ఆయన అంటున్నారు. ఇలా రెండు కీలక వర్గాలు రెండు సామాజిక వర్గాల మధ్య వైసీపీ జిల్లాలో చీలిపోయి అవస్థలు పడుతోంది. వైసీపీ అధినాయకత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది కదా అని అంటున్నారు.విజయనగరం జిల్లాలో కూడా అసంతృప్తి తారస్థాయికి చేరిన మీదటనే చిన్న శ్రీను పార్టీని వీడారని గుర్తు చేస్తున్నారు. ఇపుడు శ్రీకాకుళంతో పాటు అనేక జిల్లాలలో ఇదే రకమైన వాతావరణం ఉందని అంటున్నారు.

**రాజకీయమే చేయాలి :**

రాజకీయం అనేది ఒక క్రీడ. ఇక్కడ ఎవరికి నచ్చినట్లుగా వారు ఆడడానికి లేదు. ఈ ఆటకు సిద్ధపడితే ప్రత్యర్థి వ్యూహాలను ఎత్తులను గమనించి దానికి తగినట్లుగా పై ఎత్తులు వేయాలి. అంతే స్థాయిలో రాజకీయం చేయాలి. అలా కాదు అని మడి కట్టుకుని కూర్చుంటే రాజకీయం ఎప్పటికీ పండదని అంటున్నారు. తాజాగా మాజీ మంత్రి కొడాలి నాని కూడా జగన్ విషయంలో మాట్లాడుతూ ఆయన రాజకీయ నాయకుడు కారు అనేశారు. తన తండ్రి ఆశయ సాధన కోసం పార్టీ పెట్టుకుని నడుపుతున్నారని చెప్పారు. అలా అనుకుంటే వైసీపీ రాజకీయ క్షేత్రంలో ప్రత్యర్థి వేసే ఎత్తులకు చిత్తు అవుతూనే ఉంటుంది అన్నది కూడా సీనియర్ల మాటగా ఉంది. జగన్ తీరు మారాలని అంటున్నారు. ముల్లుని ముల్లుతోనే కోయాలి అన్నట్లుగా ఏపీలో రాజకీయానికి తగిన విధంగా వైసీపీ కూడా ధీటుగా స్పందించాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్ కు లైఫ్ వచ్చేనా

**విజయవాడ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో మరోసారి అధిష్ఠానం ఇన్‌ఛార్జ్‌ల మార్పు ప్రక్రియను పూర్తి చేసింది. శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ, మాణిక్యం ఠాగూర్ స్థానంలో కర్ణాటకకు చెందిన సీనియర్ నేత పీసీ మోహన్‌ను ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఏఐసీసీ నియమించింది. అయితే, 2014 రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ ఘోరంగా పడిపోయిన విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పునాదులు కదిలిపోయిన చోట కేవలం పర్యవేక్షకులను, ఇన్‌ఛార్జ్‌లను మార్చడం వల్ల పార్టీకి కొత్త ఊపిరి వస్తుందా అంటే.. ప్రయోజనం శూన్యమనే సమాధానమే వస్తోంది. ఏపీ విభజనకు ముందు కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోర్ ఓట్ బ్యాంక్ ఉండేది. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలు , దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులు కాంగ్రెస్‌కు వెన్నెముకగా నిలిచారు. కానీ, విభజన పర్యవసానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా.. ఆ సాంప్రదాయ ఓటు బ్యాంక్ మొత్తాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలోకి మళ్లించుకుంది. గత పదేళ్లుగా వైఎస్సార్‌సీపీకి అదే ప్రధానమైన బలంగా మారింది. కాంగ్రెస్ పునర్వైభవం సాధించాలంటే ఆ కోల్పోయిన పునాదిని మళ్లీ దక్కించుకోవడం ఒక్కటే మార్గం, కానీ ఆ దిశగా పార్టీ కేంద్ర నాయకత్వం సీరియస్ ప్రయత్నాలు చేయడంలో పూర్తిగా విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి.రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి స్పష్టమైన క్షేత్రస్థాయి వ్యూహం లేకపోవడమే అతిపెద్ద బలహీనత. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు లేదా అసెంబ్లీ వేళల్లో ప్రెస్ మీట్లు పెట్టడం, సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేయడానికే రాష్ట్ర నాయకత్వం పరిమితమవుతోంది. వైఎస్ షర్మిలకు ఏపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తర్వాత కొంతవరకు మీడియా మైలేజ్, క్యాడర్‌లో కొంత చలనం వచ్చినా.. అది ఓట్ల రూపంలోకి లేదా వైఎస్సార్‌సీపీ కోర్ ఓటు బ్యాంకును ఆకర్షించే స్థాయిలోకి మారలేదు. అసలైన జనాకర్షక నేతలు, క్షేత్రస్థాయిలో బలం ఉన్న స్థానిక నాయకత్వం లేకపోవడం వల్ల పార్టీ విస్తరణ ఆగిపోయింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు, రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఓటు బ్యాంకు స్వరూపం ఒకటే. కానీ ఏపీలో వైఎస్‌ఆర్‌సీపీని విమర్శించే క్రమంలో కాంగ్రెస్ పార్టీ టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి అనుకూలంగా ఉందనే భావన సాధారణ ప్రజల్లోకి వెళ్తోంది. ప్రత్యేకించి బీజేపీతో టీడీపీ పొత్తులో ఉన్న తరుణంలో, బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్‌కు మంచి అవకాశం ఉన్నప్పటికీ, కూటమి వైఫల్యాలపై ధ్వజమెత్తడంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉండటం లేదనే విమర్శ ఉంది. ఈ వ్యూహాత్మక అయోమయం వల్ల మైనారిటీ, దళిత వర్గాలు కాంగ్రెస్ వైపు చూడటానికి వెనుకాడుతున్నాయి.కర్ణాటకకు చెందిన పీసీ మోహన్ నాయకత్వంలోనైనా ఏపీ కాంగ్రెస్ రూట్ మ్యాప్ మారుతుందా అన్నది ఇప్పుడు సవాలు. కర్ణాటకలో కాంగ్రెస్ సాధించిన విజయం, అక్కడ అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాల మోడల్‌ను ఏపీ ప్రజల్లోకి తీసుకెళ్లడం మోహన్‌కు కొంతవరకు కలసివచ్చే అంశం. అయితే, కేవలం విజయవాడ లేదా అమరావతిలోని పార్టీ కార్యాలయాల్లో సమీక్షలు నిర్వహించడానికే ప్రాధాన్యత ఇస్తే ఎలాంటి ఫలితం ఉండదు. బూత్ స్థాయి నుంచి కమిటీలను పునర్నిర్మించడం, కూటమి ప్రభుత్వం , ప్రతిపక్ష వైఎస్‌ఆర్‌సీపీ రెండింటికీ సమదూరం పాటిస్తూ సొంత అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం తక్షణ అవసరం. రూట్ లెవల్‌లో నాయకత్వాన్ని తయారు చేయకుండా, డివైడ్ అయిన సాంప్రదాయ ఓటు బ్యాంకును ఆకట్టుకునేలా స్పష్టమైన ఆర్థిక-సామాజిక విధాన ప్రకటనలు చేయకుండా.. ఇన్‌ఛార్జ్‌లను ఎంతమందిని మార్చినా ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిపోతుంది. కొత్తగా వచ్చిన పీసీ మోహన్ అయినా కేవలం ఢిల్లీ మార్గదర్శకాలను అమలు చేసే ప్రతినిధిగా మిగలకుండా, ఏపీ కాంగ్రెస్‌కు కొత్త శ్వాస ఊదేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

## అడ్డగోలు విద్యా సంస్థలపై యాక్షన్ షురూ

**గుంటూరు, సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులను పావులుగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్న కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పి, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రోడ్లపైకి ఎక్కించి ఆందోళనలు, నిరసనలు చేయిస్తుండటంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.పోటీ పరీక్షల అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే తెచ్చిన ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026 , జీవో నెంబర్ 9 మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి ప్రైవేటు కోచింగ్ సెంటర్ నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని సంస్థల యజమానులు తెరవెనుక రాజకీయ వ్యవహారాలు నడుపుతున్నట్లు నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. సంస్థలలో చేరిన అభ్యర్థులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేలా ప్రేరేపిస్తున్నారని సీఎం దృష్టికి వచ్చింది.కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థులను ఉద్దేశపూర్వకంగా ఆందోళనలకు పురిగొల్పుతున్నారని ప్రభుత్వం తేల్చింది. కెరీర్ నిర్మించుకోవాల్సిన అమూల్యమైన సమయంలో విద్యార్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనల్లో భాగస్వాములను చేయడం తీవ్రమైన నేరమని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే సంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ముసుగులో రాజకీయ కుట్రలు పన్నుతూ వ్యవస్థలను అస్థిరపరచాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. నిబంధనల పరిధిలోనే సంస్థలు కార్యకలాపాలు సాగించాలని, విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించింది.

## లోకల్ ఎన్నికల కోసం రిజర్వేషన్ వివాదం

**తిరుపతి, సెప్టెంబర్ 16, పెన్ పవర్:** జీవో జారీ చేసినా ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు జరగవు.. బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టేస్తుంది, ఆ తర్వాత నెపాన్ని న్యాయస్థానాలపైకి నెట్టి ప్రభుత్వం నాటకాడుతుంది అని వైఎస్‌ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపణలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఎన్ని న్యాయపరమైన అడ్డంకులు వచ్చినా బీసీలకు 34 శాతం కోటా అమలు చేసి తీరుతాం అని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తూ 'జయహో బీసీ' సభల ద్వారా తమ బీసీ ఓటు బ్యాంక్‌ను పటిష్టం చేసుకునే పనిలో పడింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ వివాదం ఏమిటి? చంద్రబాబు సవాలు వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేంటి? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో.. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్ల మొత్తం శాతాన్ని 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టమైన గీత గీసింది. ప్రస్తుతం ఏపీలో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% రిజర్వేషన్లు ఉన్నందున, బీసీలకు 34% ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 55% నుండి 61% వరకు చేరుకుంటాయి. 2019లో కూడా అప్పటి ప్రభుత్వం 34% ఇస్తే హైకోర్టు , సుప్రీంకోర్టులు దాన్ని కొట్టివేశాయి. దీనివల్ల రిజర్వేషన్లు 50% దాటితే న్యాయపరంగా మళ్లీ చిక్కులు వస్తాయన్నది జగన్ వాదనకు ప్రాతిపదిక.చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడైన నాయకుడు. కోర్టు తీర్పుల పరిమితి ఆయనకు తెలియనిది కాదు. అయినా 34% జీవో ఇవ్వడం వెనుక మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 34% రిజర్వేషన్లు ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. ప్రభుత్వం తమ వైపు నుంచి 34% అమలుకు సిద్ధపడింది అన్న సందేశాన్ని ప్రజలకు ఇవ్వడం. ఒకవేళ కోర్టు దీనిని అడ్డుకుంటే, మేము ఇవ్వాలనుకున్నాం కానీ న్యాయస్థానాల పరిమితుల వల్ల కుదరలేదు అని చెప్పి బీసీల్లో సానుభూతి సాధించడం. సీలు టీడీపీకి సాంప్రదాయ వెన్నెముక. జీవో ఇవ్వడం, సభలు నిర్వహించడం ద్వారా తమ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని బలంగా స్థాపించడంవైఎస్ జగన్ విమర్శలు కేవలం న్యాయ సూత్రాల గురించే కావు. దాని వెనుక స్పష్టమైన ప్రతిపక్ష వ్యూహం దాగి ఉంది. 2019-2024 మధ్య వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం 50% పరిమితికి లోబడి బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి ఎన్నికలు నిర్వహించింది. అప్పట్లో టీడీపీ దీనిని బీసీల నోళ్లు కొట్టారు అని విమర్శించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34% జీవో ఇస్తే, తాము గతంలో చేసింది కోర్టు నిబంధనల కోసమేనని నిరూపించుకోవాల్సిన అవసరం జగన్‌కు వచ్చింది. అలాగే, రిజర్వేషన్ల వివాదం వల్ల ఎన్నికలు ఆలస్యమైతే, కూటమి ప్రభుత్వం ఎన్నికల నుంచి పారిపోతోందని ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది వైఎస్‌ఆర్‌సీపీ ఆలోచన.న్యాయ కోణం నుంచి చూస్తే, ఎంపిక చేసిన ప్రాతిపదికన ఎంపిరికల్ డేటా అంటే సామాజిక, ఆర్థిక సర్వే డేటా ఆధారంగా బీసీల వెనుకబాటుతనాన్ని నిరూపిస్తే తప్ప 50% సీలింగ్ దాటడం సాధ్యం కాదు. ఈ విషయంపై ఏపీ హైకోర్టు కూడా ప్రభుత్వం వైపు నుంచి ఆధారాలను, ఎంపిరికల్ డేటాను కోరింది. ప్రత్యేక కమిషన్ల నివేదికలు లేకుండా జీవో ఆధారంగా 50% మించి రిజర్వేషన్లు ఇస్తే, గతం తరహాలోనే న్యాయస్థానాలు దానిని నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏపీ స్థానిక పోరులో బీసీ రిజర్వేషన్ల అంశం చట్టపరమైన సవాలు కంటే రాజకీయ అస్త్రంగా ఎక్కువ ఉపయోగపడుతోంది. 34% కోటాను దక్కించుకోవడం ద్వారా బీసీల గుండెల్లో చెరగని ముద్ర వేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంటే.. ఇది సాధ్యం కాని రాజకీయ గిమ్మిక్ అని తేల్చిచెప్పడం ద్వారా టీడీపీ-బీజేపీ-జనసేనల ఇమేజ్‌ను దెబ్బతీయాలని వైఎస్‌ఆర్‌సీపీ చూస్తోంది. అంతిమంగా, కోర్టు ఇచ్చే తీర్పు స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను నిర్ణయించడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో బీసీ ఓటు బ్యాంక్ ఎటువైపు మొగ్గుతుందో స్పష్టం చేయనుంది.

## ఆరోపణలు... ప్రత్యారోపణలు డీఎస్సీకి కథ ముగింపు ఎప్పుడు

**విజయవాడ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం ఎంత ఓపికగా, పారదర్శకంగా వివరణలిస్తున్న కొద్దీ.. వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి వర్గం ఉద్దేశపూర్వకంగానే నిరాధార ఆరోపణల రాళ్లు విసురుతోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రతి సమాచారానికి వాస్తవాలతో కూడిన రివర్స్ కౌంటర్లు వస్తున్నాయని, తాము లేవనెత్తుతున్న అంశాలన్నీ గాల్లో దీపాలేనని ఆ పార్టీ నాయకులకు కూడా బాగా తెలుసు. అయినప్పటికీ ప్రజల్లో ఏదో ఒక అభూతకల్పనను నిరంతరం సజీవంగా ఉంచాలనే దుర్బుద్ధితో జగన్ రెడ్డి అండ్ కో ఈ తప్పుడు ప్రచారాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉంది. కేవలం తమ అబద్ధాలను పదే పదే ప్రచారం చేసుకుంటూ కాలం వెళ్లదీయడమే లక్ష్యం.ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోతే తాము ఆడే డ్రామాలే నిజమని జనం నమ్ముతారనే భయంతో, ప్రభుత్వం ప్రతి చిన్న అంశానికీ ఆధారాలతో సహా వివరంగా సమాధానమిస్తోంది. అయితే దీన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న వైసీపీ, అదే అలుసుగా తీసుకుని ప్రతి దానిని డీఎస్సీ స్కాం అంటూ ప్రజల మైండ్‌లో రుద్దడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. ప్రజా సమస్యలపై సద్విమర్శలు చేయడం మానేసి, కేవలం నిరుద్యోగుల ఆశలతో ఆడుకునేలా నిత్యం ఏదో ఒక వివాదాన్ని రగిలించడమే ఏకైక అజెండాగా మార్చుకుంది.ఈ కుట్రపూరిత ప్రచారంలో భాగంగా మొదట పేపర్ లీక్ అంటూ నానా హంగామా సృష్టించారు; కానీ అది ఎక్కడా నిలవకపోవడంతో వెంటనే యూటర్న్ తీసుకుని ఒకే కులానికి చెందినవారికి ఉద్యోగాలొచ్చాయంటూ' విషం చిమ్మారు. ఆ విమర్శ కూడా పటాపంచలు కావడంతో, ఇప్పుడు ఏకంగా స్పోర్ట్స్ కోటా అంశాన్ని పట్టుకుని వేలాడుతున్నారు. అసలు ఖోఖో కూడా ఒక ఆట కింద లెక్కేనా అంటూ జగన్ రెడ్డి స్వయంగా ఎద్దేవా చేయడం, క్రీడాకారుల ప్రతిభను కించపరిచేలా మాట్లాడటం చూస్తుంటే.. వినేవాళ్లు నవాబుల కాలం నాటి ఈ జోకులను ఎందుకు సీరియస్‌గా తీసుకోవాలో అర్థం కాని దుస్థితి ఏర్పడింది. కేవలం తమ రాజకీయ మనుగడ కోసం రాష్ట్రంలోని క్రీడాకారుల భవిష్యత్తును, పారదర్శకంగా భర్తీయవుతున్న ఉపాధ్యాయ నియామకాలను బలిపెట్టడానికి కూడా ఆ పార్టీ వెనుకాడటం లేదు.వైసీపీ ఆడుతున్న ఈ విషపూరిత డ్రామాలు, పన్నే ప్లాన్లకు ప్రభుత్వం ఇకనైనా పూర్తిస్థాయిలో చెక్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. రోజువారీ రాజకీయ మైలేజ్ కోసం చేస్తున్న ఈ ఆరోపణలను ఎక్కడికక్కడ చట్టపరంగా, కఠినంగా నిలువరించాల్సిన అవసరం ఉంది. కేవలం మీడియా చర్చలకు వదిలేయకుండా, కోర్టుల్లో ఏమాత్రం నిలవని, కేవలం బురదజల్లే ఈ నకిలీ డిబేట్లను తక్షణం న్యాయపరమైన చర్యలతో అడ్డుకోవాలి. లేదంటే ఈ అబద్ధాల ప్రచారమే నిజమనే భ్రమను కల్పించడంలో వారు సఫలమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తన పాలనా దక్షతను, పారదర్శకతను చాటుకుంటూనే.. వ్యవస్థలను అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్న ఈ పాత రాజకీయ శైలిని ఉక్కుపాదంతో అణచివేయాలి. నిరుద్యోగుల ఉసురుపోసుకునేలా రోజుకో డ్రామా ఆడుతున్న వైసీపీకి ప్రజాక్షేత్రంలోనూ, చట్టం ముందూ తగిన బుద్ధి చెప్పినప్పుడే ఇలాంటి నిరాధార రాళ్ల క్రీడలకు శాశ్వత బ్రేక్ పడుతుంది.

# జాతీయ గర్వం అహంకారంగా మారితే.. గెలుపుకు ప్రాధాన్యత ఉండదు:

## భారత్ ట్రోఫీ నిరాకరణపై మహమ్మద్ యూసఫ్

**ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు**

**నక్వీ చేతుల మీదుగా ట్రోఫీ స్వీకరించేందుకు నిరాకరించిన టీమ్**

**వినయం లేని దేశం గెలిచినా ఓడిపోయినట్టే అన్న యూసఫ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ మంత్రి మోహ్సిన్ నక్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించేందుకు నిరాకరించడం తీవ్ర దుమారం రేపుతోంది. గత ఏడాది పురుషుల ఆసియా కప్ సమయంలోనూ భారత పురుషుల జట్టు నక్వీ నుంచి ట్రోఫీని తీసుకోకుండా సంచలన నిర్ణయం తీసుకుంది. తాజాగా భారత మహిళల జట్టు కూడా అదే బాటలో పయనించి నక్వీకి షాక్ ఇచ్చింది. దుబాయ్‌లో జరిగిన ఫైనల్ పోరులో శ్రీలంకపై 72 పరుగుల తేడాతో విజయం సాధించి భారత మహిళల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అయితే నక్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోకూడదనే నిర్ణయం వెనుక బీసీసీఐ ముందస్తు వ్యూహం ఉంది.

ఈ ట్రోఫీ నిరాకరణ ఘటనపై పాకిస్థాన్ మాజీ దిగ్గజ క్రికెటర్ మహమ్మద్ యూసఫ్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించాడు. "జాతీయ గర్వం కాస్తా అహంకారంగా మారినప్పుడు, గెలుపునకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదు. జట్టు గెలవవచ్చు, కానీ వినయం లేని దేశం ఓడిపోయినట్టే" అని ట్వీట్ చేశాడు. మోహ్సిన్ నక్వీని ప్రశంసిస్తూ యూసఫ్ చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ట్రోఫీ తీసుకోకపోవడంపై బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా స్పందిస్తూ ఇది బోర్డు తీసుకున్న సంస్థాగత నిర్ణయమని స్పష్టం చేశారు. వేడుకల్లో పాల్గొనకూడదనే విషయాన్ని ఏసీసీకి ముందే అధికారికంగా తెలియజేశామని ఆయన వెల్లడించారు. గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి, ఆ తర్వాత చోటుచేసుకున్న సైనిక ఉద్రిక్తతల దృష్ట్యా దేశప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది ఆటగాళ్లకు లేదా క్రీడకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలోని వ్యూహాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

# ఫ్రాంచైజీల విజ్ఞప్తి.. ఇకపై ఇండియాలోనే ఐపీఎల్ మినీ వేలం


**స్వదేశానికి తిరిగి రానున్న ఐపీఎల్ మినీ వేలం**

**ఫ్రాంచైజీల విజ్ఞప్తితో పాలకమండలి నిర్ణయం**

**2024 నుంచి దుబాయ్, జెడ్డా వంటి నగరాల్లో వేలం**

**వేదికపై ఇంకా రాని స్పష్టత**

**ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై కొనసాగుతున్న చర్చ**




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మినీ వేలాన్ని తిరిగి భారత్‌లోనే నిర్వహించాలని ఐపీఎల్ పాలకమండలి (జీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్నేళ్లుగా విదేశాల్లో నిర్వహిస్తున్న ఈ సంప్రదాయానికి స్వస్తి పలకాలని మంగళవారం జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మానించారు. 2024 నుంచి ఐపీఎల్ వేలాన్ని దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, మినీ వేలం కోసం తమ బృందాలను విదేశాలకు తరలించడం రవాణా పరంగా, నిర్వహణాపరంగా సవాలుగా మారుతోందని ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేశాయి. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న గవర్నింగ్ కౌన్సిల్, 2027 మినీ వేలాన్ని భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, వేలం నిర్వహించే నగరాన్ని ఇంకా ఖరారు చేయలేదు. పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా హోటల్ గదుల లభ్యతను బట్టి వేదికను ఖరారు చేయనున్నారు. మినీ వేలాన్ని భారత్‌కు మార్చినప్పటికీ, ఆ తర్వాతి ఏడాది జరిగే మెగా వేలాన్ని మాత్రం విదేశాల్లోనే నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఇదే సమావేశంలో 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై కూడా పాలకమండలి సుదీర్ఘంగా చర్చించింది. ఈ నిబంధనపై ఫ్రాంచైజీల నుంచి అభిప్రాయాలను స్వీకరించి, తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనుంది.

# 2027 ప్రపంచకప్ గెలవాలంటే ఆ తప్పులు చేయొద్దు.. టీమిండియాకు యువరాజ్ కీలక సలహా



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని భారత జట్టు యాజమాన్యానికి మాజీ ఆల్-రౌండర్, 2011 ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్ కీలకమైన సలహాలు ఇచ్చాడు. టోర్నమెంట్‌కు ముందు చివరి నిమిషంలో జట్టులో భారీ మార్పులు చేయడం మానుకోవాలని, ఇప్పటి నుంచే ఒక కోర్ జట్టును గుర్తించి వారిపై నమ్మకం ఉంచాలని సూచించాడు. దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళితేనే విజయం సాధ్యమవుతుందని స్పష్టం చేశాడు. క్రిక్‌ఇన్ఫోతో మాట్లాడుతూ యువరాజ్ సింగ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. "భారత జట్టు కీలక టోర్నీలలో విఫలమైన ప్రతీసారి, దానికి కారణం చివరి నిమిషంలో భారీ మార్పులు చేయడమే. కాబట్టి 2027 ప్రపంచకప్ గెలవగలదని మనం నమ్మే జట్టును ఎంచుకుని, టోర్నీ వరకు వారికే అండగా నిలవడం చాలా ముఖ్యం. వారు గెలిచినా, ఓడినా జట్టుపై నమ్మకం ఉంచాలి" అని యువరాజ్ వివరించాడు. ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న తరుణంలో 50 ఓవర్ల మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోయిందని యువీ గుర్తుచేశాడు. అందువల్ల ఎంపిక చేసిన ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించాలంటే, రాబోయే ఏడాది కాలంలో వారికే స్థిరంగా అవకాశాలు కల్పించాలని అన్నాడు. 12 నుంచి 14 మందితో కూడిన అత్యుత్తమ జట్టును ఎంపిక చేసుకుని, మైదానం, పరిస్థితులకు అనుగుణంగా తుది జట్టులో ఒకటి రెండు మార్పులు చేయవచ్చని తెలిపాడు. గతంలో ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్‌లు గెలవడానికి కారణం వారి జట్టులో మ్యాచ్ విన్నర్లు ఉండటమేనని యువరాజ్ ఉదహరించాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఉన్న ఆటగాళ్లను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని సూచించాడు.

ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కూడా ఇదే విధానాన్ని అనుసరించిందని, స్థిరమైన జట్టుతో బరిలోకి దిగడం వల్లే విజయం సాధ్యమైందని యువీ విశ్లేషించాడు. 2027 ప్రపంచకప్ కోసం కూడా ఇదే తరహా వ్యూహంతో ముందుకు సాగాలని జట్టు యాజమాన్యానికి సలహా ఇచ్చాడు.

# ట్రెండీ టాక్: 50 ప్లస్ హీరోలకు 'ఇరుముడి' నేర్పిన పాఠం





సినిమా రంగంలో స్టార్ హీరోల వయసు మారుతున్న కొద్దీ వారి పాత్రల ఎంపికలోనూ పరిణతి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మరోసారి ప్రూవ్ అయింది. తమ వయసుకు తగిన పాత్రలు చేస్తేనే ఎంత పెద్ద హీరోనైనా ప్రేక్షకులు తెరపై ఆదరిస్తారని.. లేదంటే ప్రేక్షకుల నుంచి ఘోరమైన తిరస్కారం తప్పదని గత పరిణామాలు స్పష్టం చేసాయి. రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు బిగ్ డిబేట్ కి కారకం. పెళ్లీడుకొచ్చిన కూతుళ్లు ఉన్నప్పటికీ ఇంకా యువ హీరోయిన్లతో రొమాంటిక్ లవ్‌స్టోరీల్లో నటిస్తున్న 60 ప్లస్ హీరోలకు ఇదొక పెద్ద కనువిప్పు లాంటి పరిణామం. మన పరిశ్రమలో ఉన్న 50 ప్లస్ హీరోలు ఇకపై రొమాంటిక్ పాత్రలను పక్కన పెట్టి.. కథకు బలమైన డాడీ పాత్రల్లో.. బాధ్యతాయుతమైన రోల్స్‌లో నటించాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటివరకు ఇద్దరేసి హీరోయిన్లతో ప్రేమలో నిండా మునిగి, రొమాన్స్ చేయడంలో బిజీగా ఉన్న మాస్ మహారాజా రవితేజ ఇటీవల -ఇరుముడి- చిత్రంలో మొదటిసారి కూతురిని అమితంగా ప్రేమించే బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో నటించారు. తెరపై ఆయనలోని ఈ విప్లవాత్మక మార్పును ప్రేక్షకులు ఎంతో మనసారా స్వాగతించారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథా బలం ఉన్న తండ్రి పాత్రను ఎంచుకోవడం వల్ల ఆ సినిమా ఘనవిజయం సాధించడమే కాకుండా.. నటుడిగా అతడి మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఈ విజయంతో 50 ప్లస్, 60 ప్లస్ హీరోలందరూ ఇకపై తమ వయసుకు తగిన పాత్రలనే ఎంచుకోవాల్సి ఉంటుందనే సూచన స్పష్టంగా కనిపిస్తోంది. ఇండస్ట్రీ దిగ్గజ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లు ఇప్పటికే చాలావరకు తమ వయసుకు తగినట్లు పరిణతి ఉన్న విభిన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ దూసుకెళుతున్నారు. నాగార్జున సైతం ప్రయోగాత్మక కంటెంట్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. 'ఇరుముడి' తరహాలో భావోద్వేగాలతో కూడిన తండ్రి పాత్రలు ఈ సీనియర్ హీరోలందరికీ కూడా వందశాతం సూటబుల్ ఆప్షన్‌గా మారుతున్నాయి.

అలా కాకుండా పాత పద్ధతిలోనే ఇంకా హీరోయిన్లతో లవ్వాయణాలు, రొమాంటిక్ కామెడీలు చేస్తూ పోతే నేటి ప్రేక్షకులు నిర్దయంగా తిరస్కరిస్తున్న ఉదాహరణలు చూస్తూనే ఉన్నాం. నేటి మాస్ ఫ్యాన్స్ కూడా ఓటీటీలు, వెబ్ సిరీస్‌లు, హాలీవుడ్ సినిమాలు, లైవ్ సిరీస్ లు విపరీతంగా చూస్తూ పూర్తిగా అప్‌గ్రేడ్ అయ్యారు. వారి అభిరుచులు మారడంతో రొటీన్ కమర్షియల్ ఫార్ములా సినిమాలు బెడిసికొడుతున్నాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, షారూఖ్ ఖాన్ వంటి దిగ్గజాలు కూడా గ్లామర్ పాత్రలను పక్కన పెట్టి తమ వయసుకు తగ్గ పరిణతి ఉన్న తండ్రి లాగానో లేదా వయసుకు తగ్గ పాత్రల్లోను నటిస్తుండటం గమనార్హం. మొత్తానికి ఏజ్ పెరుగుతున్న కొద్దీ స్టార్ హీరోలు తమ పంథాను మార్చుకోవాల్సిన టైమ్ వచ్చేసింది. హాలీవుడ్ హీరోల మాదిరిగా మారుతున్న కాలానికి తగినట్లు తమ ఇమేజ్‌ను అప్‌గ్రేడ్ చేసుకుంటూ.. వైవిధ్యమైన పాత్రలతో మైలేజ్ పెంచుకోవడమే సీనియర్ హీరోలకు సరైన మార్గం. కేవలం డ్యాన్సులు, రొమాన్స్ చుట్టూ తిరగకుండా బలమైన భావోద్వేగాలు ఉన్న క్యారెక్టర్లను ఎంచుకుంటేనే బాక్సాఫీస్ వద్ద విజయం సొంతమవుతుందని నిరూపణ అయింది. ఇరుముడి నేర్పిన పాఠం టాలీవుడ్ 50 ప్లస్ హీరోలకు నిజంగానే కలిసి వస్తుందని ఆశిద్దాం.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com